తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice
వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

22-08-2026

శనివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 195

PUBLISHED FROM HYDERABAD    పేజీలు-12    వెల: రూ.4/-



## వర్షమేనా ఈ ప్రాజెక్టు ఆధారమా!

### ప్రాజెక్టు నీరు లేకపోతే రైతుల పరిస్థితి ఏమిటి?

- దిగులుతో రైతన్నలు
- ప్రాజెక్టులో నీటి లేకపోతే మా పరిస్థితి ఏమిటి?
- అన్ని రకాలుగా పంటకు సాగు చేశాం నీరు లేకపోతే ఇబ్బంది

5




# అక్షర సమరం.. ఇక 'దృశ్య' విప్లవం!

నేడు 'సిరి డిజిటల్ టీవీ' ప్రారంభోత్సవం

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోనే సొంత గడ్డపై ప్రధాన కార్యాలయం ఓపెనింగ్

- ఎన్నో అవమానాలు, ఆటుపోట్లు ఎదుర్కొని ప్రతిరోజు 2 లక్షల మంది వీక్షకులకు దగ్గరై..
- సామాన్యుడి గొంతుకగా మారి.. వ్యవస్థలోని లోపాలను ఎండగట్టిన 'సిరి' అక్షర సైనికులు
- ఎన్నో ఇన్వెస్టిగేటివ్ కథనాలతో అధికారుల్లో కదలిక తెచ్చిన విశ్లేషణలు
- ఇప్పుడు డిజిటల్ టెక్నాలజీతో దృశ్య మాధ్యమంలోకి..
- పాఠకుల నమ్మకం, ప్రకటనకర్తల సహకారం, విలేకరుల శ్రమతోనే సంస్థ విజయం

అక్షరానికి ఆయుధమంత బలం ఉంటుందని నిరూపిస్తూ, ప్రజా పక్షాన నిలిచి, నిష్పక్షపాత జర్నలిజానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది 'సిరి' దినపత్రిక. పాఠకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంటూ విజయవంతంగా తన అక్షర ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న 'సిరి'.. ఇప్పుడు మరో చారిత్రాత్మక అడుగు వేయబోతోంది. సిరి దినపత్రిక ప్రారంభించిన తొలినాళ్లలో ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదురయ్యాయి. అయినా మొక్కవోని ధైర్యంతో కొద్దిమంది పాత్రికేయులతో ప్రయాణం మొదలు పెట్టి, ఏడాది కాలం పూర్తయ్యే నాటికి ప్రధాన పత్రికలకు దీటుగా అక్షర సైనికులను తయారు చేసుకుంది. పటిష్టమైన కథనాలు అందించే పాత్రికేయులు, అద్భుతమైన పేజీ మేకింగ్‌తో డెస్క్ సిబ్బంది సహకారంతో ప్రభంజనం సృష్టించింది.

(ప్రత్యేక ప్రతినిధి సిరి న్యూస్)

### ఇన్వెస్టిగేటివ్ కథనాలు.. పరిష్కార మార్గాలు

అధికార యంత్రాంగంలో లోపాలను ఎండగట్టడంలో, ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తేవడంలో 'సిరి' ఎప్పుడూ ముందే ఉంది. ఎన్నో ఇన్వెస్టిగేటివ్ స్టోరీలు వ్యవస్థలో కదలిక తెచ్చాయి. క్షేత్రస్థాయి సమస్యలపై రాసిన ప్రతి అక్షరానికి సమాజం నుండి, పాలకుల నుండి అద్భుతమైన స్పందన లభించింది. ఎన్నో సంక్లిష్టమైన సమస్యలకు 'సిరి' కథనాలే పరిష్కార మార్గాలుగా నిలిచాయి. ముద్రణా రంగంలో సంచలనాలు సృష్టించిన అదే నిబద్ధతతో, ఇప్పుడు దృశ్య మాధ్యమంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ అతి త్వరలో ప్రజల ముందుకు రాబోతోంది.

### 22న సిరి డిజిటల్ టీవీ ఆరంభం!

కాలంతో పాటు మారుతున్న సాంకేతికతను అందుకుంటూ, వార్తలను మరింత వేగంగా, దృశ్య రూపంలో ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా ఈనెల 22న 'సిరి డిజిటల్ టీవీ' ప్రారంభం కాబోతోంది. కేవలం సంచలనం కోసమే కాకుండా, నిజనిజాలను నిష్పక్షపాతంగా, అత్యంత వేగంగా డిజిటల్ తెరపై ప్రసారం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. నేటి స్మార్ట్‌ఫోన్ యుగంలో ప్రతి ఒక్కరి చేతిలో ఉన్న డిజిటల్ స్క్రీన్‌ల ద్వారా నేరుగా ప్రజల సమస్యలను, సమాజ గమనాన్ని లైవ్ అప్‌డేట్స్ రూపంలో అందించేందుకు అత్యాధునిక సాంకేతికతతో రంగం సిద్ధమైంది. పత్రికగా సంపాదించుకున్న అపారమైన నమ్మకాన్ని, పారదర్శకతను డిజిటల్ టీవీలోనూ అక్షరాలా కొనసాగించేందుకు సరికొత్త కార్యక్రమాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది.

### సంగారెడ్డి గడ్డపై సొంత కార్యాలయం

దీంతో పాటు సిరి పత్రిక, సిరి టీవీల కోసం అత్యాధునిక వసతులతో సొంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోనే ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం సొంత గడ్డపై ఉన్న మమకారానికి, స్థానిక అభివృద్ధికే ప్రాధాన్యం ఇచ్చే నైజానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఒక పత్రిక విజయవంతంగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తుండడం.. ఆ తర్వాత డిజిటల్ ఛానెల్‌గా విస్తరించడం వెనుక ఉన్న అసలైన శక్తి పాఠకుల నమ్మకం, ప్రకటనకర్తల సహకారం, అలాగే క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించే విలేకరుల సైన్యం.




### దృశ్య రూపంలో మీ అరచేతిలో 'సిరి'!

మీరిచ్చిన నిరంతర ప్రోత్సాహమే ఈ రోజు 'సిరి'ని మరో ఎత్తైన మెట్టు ఎక్కించేలా చేసింది. అక్షరంతో మొదలైన ఈ 'సిరి' ప్రయాణం.. ఇప్పుడు దృశ్యరూపమై మీ ఇళ్లల్లోకి, మీ గుండెల్లోకి చేరబోతోంది. ఈనెల 22న అత్యంత వైభవంగా ప్రారంభం కానున్న 'సిరి డిజిటల్ టీవీ'ని కూడా అదే ఆదరాభిమానాలతో ఆశీర్వదిస్తారని ఆశిస్తూ, సంస్థ యాజమాన్యానికి, పాత్రికేయులకు, డెస్క్ సిబ్బందికి, విలేకరుల సైన్యానికి హృదయపూర్వక శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.




### లక్షలాది వీక్షకుల నమ్మకమే శక్తి

ఇంతింతై వటుడింతయై అన్నట్లు కొద్దిమంది వీక్షకులతో ప్రారంభమైన సిరి పత్రిక, తన గమనాన్ని అత్యంత నిబద్ధతతో కొనసాగిస్తూ సుమారు ప్రతిరోజు 2 లక్షల మందికి పైగా వీక్షకులు పత్రికను అనుసరించే స్థాయికి చేరింది. అనతి కాలంలోనే 'సిరి' కేవలం ఒక దినపత్రికగా మాత్రమే మిగిలిపోలేదు. అది సామాన్యుడి గొంతుకగా మారింది. సమాజంలో ఎవరూ తాకని కోణాలను స్పృశిస్తూ, నిత్యం వైవిధ్యభరితమైన ఫీచర్లు, విశ్లేషణలతో పాఠకులకు సరికొత్త పఠనానుభూతిని అందించింది. ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తేవడంలో ఎప్పుడూ ముందే ఉంటూ తన ప్రత్యేక గుర్తింపును నిలబెట్టుకుంది.






సిరి TV People's Voice

విశ్వసనీయత, నిబద్ధతకు మారు పేరు 'సిరి'



# శిశు మందిర్ లో సామూహిక వరలక్ష్మీవ్రతాలు




**పెద్ద శంకరం పేట, ఆగస్టు 21, (సిరి న్యూస్):** వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని పెద్ద శంకరంపేట లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ లో శుక్రవారం అధిక సంఖ్యలో మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. పూజారి రాయల కృష్ణ శర్మ వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో సామూహికంగా మహిళలు వరలక్ష్మి వ్రతాలు చేశారు. ప్రత్యేకంగా అమ్మ వారిని అలంకరించి మహిళలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి మంగళ హారతులతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులందరికీ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శిశు మందిర్ పాఠశాల అధ్యక్షులు దాదిగారి గంగాధర్, ప్రధానాచార్యులు లక్ష్మీనారాయణ,. ఆచార్యులు జైహింద్ రెడ్డి. శ్రీనివాస్, ప్రబంధ కారిని సభ్యులు శ్రవణ్ కుమార్, గాండ్ల సంగమేశ్వర్, రవి వర్మ, సంతోష్ కుమార్, మాతాజీలు, మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దీన్ దయాల్ స్పర్శ పథకానికి స్కాలర్షిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

**పటాన్ చెరు, ఆగస్టు 21, (సిరి న్యూస్)**



సంగారెడ్డి జిల్లా పరిధిలోని 6 నుండి 9వ తరగతి విద్యార్థుల కోసం 2026 27 సంవత్సరానికి గాను దీన్ దయాల్ స్పర్శ్ పథకానికి స్కాలర్షిప్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ డి. శ్రీహరి ఒక ప్రకటనలు తెలిపారు.

పిల్లలలో ఫిలాటలీ పట్ల ఆసక్తిని పెంపొందించడం , స్టాంపుల సేకరణను ఒక హాబీగా ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశమని ఎస్పీ అన్నారు.

6 వ తరగతి నుండి 9 వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులని తెలిపారు.

దీని కింద ఎంపికైన ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 6000/ చొప్పున స్కాలర్షిప్ ఉంటుందన్నారు. మూడు నెలల కు రూ. 1500/ చొప్పున మొత్తం 6 వేల రూపాయలు ఇస్తారని ఆయన వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు తమ దరఖాస్తులను నిర్ణీత ఫార్మాట్ లో వచ్చే నెల15 వ తేదీ లోపు సంగారెడ్డి డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ కార్యాలయానికి సమర్పించాలన్నారు. మిగతా వివరాలకు వెబ్ సైట్: https://www.indiapost.gov.in/sparshphilately ద్వారా దరఖాస్తు ఫారం పొందవచ్చని వివరించారు. కావున అర్హులైన విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఎస్పీ డి.శ్రీహరి కోరారు.

# శ్రావణ శుక్రవారం.. వరలక్ష్మీ వ్రతాలతో మహిళల సందడి

**గుమ్మడిదల, ఆగస్టు 21 (సిరి న్యూస్):**



శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతానికి విశిష్టమైన స్థానం ఉండటంతో గుమ్మడిదల మండలంలోని మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలను ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా పలు ఇళ్లలో ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు తమ ఇళ్లను శుభ్రం చేసి, మామిడి తోరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి వరలక్ష్మీ దేవిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.

అష్టలక్ష్ముల్లో వరలక్ష్మీ దేవికి ప్రత్యేక స్థానం ఉందని, వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం ద్వారా కుటుంబంలో సుఖసంతోషాలు, ఐశ్వర్యం, శ్రేయస్సు కలగాలని మహిళలు విశ్వసిస్తారు. ఈ నేపథ్యంలో శ్రావణమాసంలో వచ్చే వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శుక్రవారం ఉదయం నుంచే మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి పూజా కార్యక్రమాలకు సిద్ధమయ్యారు. ఇళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూజా మండపాల్లో వరలక్ష్మీ దేవి అమ్మవారి విగ్రహం, కలశాన్ని పూలు, పసుపు, కుంకుమతో అందంగా అలంకరించారు. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేసి, పండ్లు, పిండి వంటలు, తీపి పదార్థాలు తదితర నైవేద్యాలను సమర్పించారు. అనంతరం వరలక్ష్మీ వ్రత కథను చదువుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. వ్రత పూజలు పూర్తయిన అనంతరం మహిళలు ఒకరినొకరు పసుపు, కుంకుమ, తాంబూలం అందించుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కుటుంబ సభ్యులంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ఇంటిల్లిపాదికి అమ్మవారి అనుగ్రహం లభించాలని ప్రార్థించారు. పలుచోట్ల మహిళలు సమూహాలుగా చేరి భక్తి పాటలు, వ్రత కార్యక్రమాలను నిర్వహించడంతో శ్రావణ శుక్రవారం సందడి నెలకొంది.

# ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత



- **ముత్తంగిలో తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారుల చర్యలు**

**రామచంద్రపురం(పటాన్‌చెరు), ఆగస్టు 21 (సిరి న్యూస్) :**

ముత్తంగి గ్రామ పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ముత్తంగి గ్రామంలోని సర్వే నంబర్లు 65, 23లోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించిన అధికారులు ఈ చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా ఆక్రమణలను గుర్తించి తొలగిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించకుండా ప్రజలు సహకరించాలని సూచించారు. భవిష్యత్తులోనూ ప్రభుత్వ భూములపై ఆక్రమణలను అడ్డుకునేందుకు చర్యలు కొనసాగిస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

## ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య



**పాపన్నపేట్ ఆగస్టు 21 సిరి న్యూస్ :**

కడుపు నొప్పితో బాధపడుతూ ఉరి వేసుకుని ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామంలో జరిగింది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు, లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన వగ్గు రశిత(14) మండలంలోని యూసుఫ్ పేట ఉన్నత పాఠశాలలో ఎనిమిదివ తరగతి చదువుతుంది.తరచూ కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేది. పలుమార్లు హాస్పిటల్ లలో వైద్యం చేసిన కడుపు నొప్పి తగ్గడం లేదు.శుక్రవారం ఉదయం సమయంలో కడుపునొప్పితో బాధపడుతూ ఇంట్లో దిగులుగా ఉంది.తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లగానే ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.కొంత సమయం తరువాత గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.



# మళ్లీ తెరపైకి సీల్డ్ కవర్ సీఎం!




- వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోని మాట.. మళ్లీ సుస్మిత నోట
- రాష్ట్ర రాజకీయాల్లో కాక రేపుతున్న 'కొండా' వ్యాఖ్యలు
- రేవంత్ రెడ్డిని సీఎం పీఠం నుంచి దించేందుకు ఏకమవుతున్నారా?
- అసలు అధిష్టానం ఆ దిశగా ఆలోచన చేస్తుందా..?
- అందుకే అంసతృప్తులు బయట పడుతున్నట్లు పుకార్లు
- సుస్మిత వ్యాఖ్యలు వ్యక్తిగతమా..? లేక ఎవరైనా చేయించారా?
- రేవంత్ సోదరుల వేల కోట్ల కుంభకోణాలను సిద్ధరామయ్య ఎపిసోడ్‌తో పోలుస్తూ ఎండగట్టిన కేటీఆర్
- ఇప్పటికే ఈ విషయమై అధిష్టానానికి అందిన నివేదిక?
- భట్టి, మహేష్ కుమార్ గౌడ్ తోనూ రేవంత్‌కు పెరిగిన అంతర్గత విభేదాలు
- రేవంత్ కు బలంగా పనిచేస్తున్న వ్యతిరేక వర్గం
- ఆగస్టు సంక్షోభాలు పునరావృతం కానున్నాయా?

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనూ, ఆ ముందు కాంగ్రెస్ పాలన లోనూ బాగా వినిపించిన 'సీల్డ్ కవర్ సీఎం' అనే పదం తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ తెరపైకి వచ్చింది. పదేళ్ల బీఆర్ఎస్ పాలన ముగిసి కాంగ్రెస్ అధికారం చేపట్టి రెండున్నరేళ్లు కావస్తుండడంతో ఇటీవల సీఎం మార్పుపై తీవ్రస్థాయిలో చర్చలు మొదలయ్యాయి. మళ్లీ ఆ పుకార్లు సద్దుమణిగాక ఇటీవల మంత్రి కొండా సుస్మిత ఇంత వరకు ఎవరూ చేయని విధంగా చేసిన వ్యాఖ్యలు మళ్లీ రాష్ట్రవ్యాప్తంగా పెను దుమారాన్ని రేపుతున్నాయి. ''ముఖ్య మంత్రి కాగానే కళ్లు నెత్తికెక్కాయా..? నువ్వు సీల్డ్ కవర్ సీఎం అని గుర్తు పెట్టుకో.. సీఎంగా రేవంత్‌రెడ్డి ఉంటాడో? ఊడిపోతడో? అనేది కొంచెం అనుమానంగా ఉన్నది.. రేవంత్‌రెడ్డి ప్రవర్తనను అధిష్ఠానం అన్నికోణాల్లో జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్టు తమకు సమాచారం ఉన్నది'' అని చెప్పారు. ఇవే వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారాయి.. రేవంత్ రెడ్డి సోదరుల వేల కోట్ల అవినీతి అక్రమాల ఆరోపణలు, ముఖ్యమంత్రిగా ఏకపక్ష నిర్ణయాలతో ఎమ్మెల్యేలు, సీనియర్ మంత్రులు తీవ్ర ఆగ్రహంతో ఉన్న విషయం కొంత కాలంగా బహిర్గతం అవుతూనే ఉన్నాయి. అసలు తెలంగాణలో నిజంగానే సీఎం మార్పు అంశంపై కాంగ్రెస్ అధిష్టానం ఆలోచిస్తుందా..? రేవంత్‌పై ఢిల్లీ పెద్దల వద్ద ఉన్న నివేదికలు నిజమేనా? ఇంతకీ 'సీల్డ్ కవర్ సీఎం' అంటూ సుస్మిత వ్యాఖ్యల వెనుక ఎవరున్నారనే అంశాలతో పాటు వివిధ రకాల కోణాల్లో చర్చలు తెరపైకి వస్తున్నాయి..

**ఇంకే విషయాలు బయపెడుతోందోననే చర్చ..**
సీఎంపై ఎంత అసహనం, అసంతృప్తి ఉన్నా ఇప్పటివరకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి సీనియర్ నేతలు కూడా లేవనెత్తని తీవ్ర మైన కుంభకోణాలు మరియు 'సీల్డ్ కవర్ సీఎం' అంశాలను మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుస్మిత నేరుగా లేవనెత్తడం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద కలకలం రేపింది. 'రేవంత్ రెడ్డి, ఆయన తమ్ముళ్లు రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారు. నీ తమ్ముడి రూ. 200 కోట్ల భూమి ముచ్చటే చెప్పిన, నా మీద కౌంటర్ ఇస్తే మొత్తం బండారం బయటపెడతా' అని ఆమె సీఎంకు బహిరంగ హెచ్చరిక చేశారు. రేవంత్‌ను టీపీసీసీ అధ్యక్షుడు చేయడానికి కష్టపడిన తన తండ్రి కొండా మురళీధర్‌రావు, దయాసాగర్, షబ్బీర్ అలీ వంటి నేతలను విస్మరించి, వారికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. కొడంగల్‌లో ప్రజలు ఓడగొట్టిన విషయాన్ని రేవంత్ గుర్తుపెట్టుకోవాలని, వైఎస్సార్ లాంటి వారే పదేళ్లు సీఎంగా ఉంటానని చెప్పుకోలేదని విమర్శించారు' అంటూ అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేయడం గమనార్హం.. అయితే ఇంకా ఏయే విషయాలు భవిష్యత్తులో సుస్మిత బయట పెడుతుందో అనే అంశం కూడా కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి..

**రేవంత్ వ్యతిరేక వర్గం చెప్పించిందా?**
ఒక మంత్రి కూతురు అయి ఉండి, నేరుగా ముఖ్యమంత్రిపైనే ఇంత ఘాటుగా విరుచుకు పడటం వెనుక కాంగ్రెస్‌లోని రేవంత్ వ్యతిరేక వర్గం లేదా నేరుగా ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్టానం నుంచే పక్కా సమాచారం అందుతోందా? అనే అంశంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. రేవంత్ రెడ్డి పాలనా శైలి, సోదరుల వ్యాపార వ్యవహారాలు, అవినీతి ఆరోపణలపై ఢిల్లీ పరిణామాలు అనుక్షణం కాంగ్రెస్ సీనియర్లకు చేరుతున్నాయని, దాంతోనే ధైర్యంగా సుస్మిత ద్వారా ఈ తీవ్ర వ్యాఖ్యలు చేయించారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ శ్రేణుల్లో రేవంత్‌కు వ్యతిరేకంగా ఒక పెద్ద నెట్‌వర్క్ రూపుదిద్దుకుంటోందనడానికి ఈ ఘటనే సజీవ నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు.

**భట్టి, మహేష్‌లతో విభేదాలు..**
మరోవైపు ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి దళిత ముఖ్యమంత్రి రేసులో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో, బీసీ ముఖ్యమంత్రి అంశంపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో సీఎం రేవంత్ రెడ్డికి అంతర్గత విభేదాలు ఉన్నా అవి బయటకు వచ్చినప్పుడల్లా నార్మల్ గానే తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని చెబుతూ వస్తున్నారు. ఇటీవల మహేష్ కుమార్ గౌడ్ పై రేవంత్ అనుకూల మీడియాలో వరుస కథనాలు సైతం ప్రసారమవడం..వాటి వెనుక రేవంత్ రెడ్డి హస్తం ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈ అంశం సైతం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా అధిష్టానం వద్ద నివేదిక ఉన్నట్లు అప్పట్లో చర్చ జరిగింది. మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేల నుంచి వెల్లువెత్తుతున్న అసంతృప్తి అంతా క్రమంగా ఢిల్లీ పీఠానికి చేరినట్లు కూడా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కర్ణాటకలో సీఎంను మార్చినట్లు తెలంగాణలో కూడా రేవంత్ రెడ్డి మార్చాలని కొంతమంది సీనియర్లు తెలరపైకి తెచ్చినట్లు సమాచారం. ఈ అన్ని పరిణామాల నేపథ్యంలోనే కొండా సుస్మిత రగిల్చిన మంటలు 'సీల్డ్ కవర్ సీఎం' అంశానికి తెరతీశాయి..

**రేవంత్ సోదరుల కుంభకోణాల చిట్టా అధిష్టానం వద్ద ఉన్నాయా?**
కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్య సతీమణికి 3 ఎకరాల భూమి కేటాయింపు వ్యవహారంపై ప్రతిపక్షాల ఫిర్యాదుతో లోకాయుక్త విచారణ జరిగి ఆయన రాజీనామా దిశగా పరిణామాలు వెళ్లిన విషయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల ప్రత్యేకంగా గుర్తుచేశారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి తన సోదరుడు అనుముల కొండల్ రెడ్డికి చెందిన టెస్సెరాక్ట్ అనే షెల్ కంపెనీకి రూ. 200 కోట్ల విలువైన 5 ఎకరాల అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని కేవలం రూ. 7 కోట్లకే కేటాయించి తీవ్ర కుంభకోణానికి పాల్పడ్డారని కేటీఆర్ ధ్వజమెత్తారు.. కొండల్ రెడ్డి తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లోనే చైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని, అమెరికా ఎంబసీ ప్రతినిధులతో భేటీలు కూడా అయ్యారని తెలిపారు. అయితే మార్చి 31, 2025 నాటి రికార్డుల ప్రకారం కంపెనీ ప్రారంభ మూలధనం కేవలం లక్ష రూపాయలని, అందులో ఒక్క ఉద్యోగి కూడా పనిచేయడం లేదని, వెబ్‌సైట్‌లో ఫోన్ నంబర్ '123456789' అని ఉందంటేనే ఆ షెల్ కంపెనీ దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందన్నారు. దీనితో పాటు అమెరికాలోని మరో సోదరుడు జగదీష్ రెడ్డి 'స్వచ్ఛ్ బయో' కంపెనీతో రూ. 1,000 కోట్ల ఒప్పందం, బావమరిది సృజన్ రెడ్డికి రూ. 1,137 కోట్ల అమృత్ పథకం కాంట్రాక్ట్ కట్టబెట్టడం, సింగరేణి వ్యవహారాల కనుసన్నలపై ఢిల్లీ పెద్దలకు ఆధారాలు చేరాయని కేటీఆర్ ఇటీవల స్పష్టం చేశారు. ఈ అన్ని అంశాలు ఢిల్లీ అధిష్టానం పరిశీలిస్తుందని, ఇలాగే కొనసాగితే వచ్చే ఎన్నికల్లో పార్టీకి పరాభవం తప్పదని ఆలోచనచేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ సమాచారం కొండా ఫ్యామిలీ వద్ద ఉండబట్టే.. కొంతకాలంగా కొండా సురేఖ ఏమాత్రం ముఖ్యమంత్రి విషయంలో తగ్గడం లేదని తెలుస్తోంది. సుస్మిత సైతం అందుకే అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారిన సమాచారం.

**ఆగస్టు సంక్షోభాలు పునరావృతం కానున్నాయా?**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆగస్టు నెలకు ఓ ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఎందుకంటే 1984-1995 మధ్య రెండుసార్లు ఆగష్టు నెలలో అతి పెద్ద రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఏకంగా ముఖ్యమంత్రి సైతం మారేంత పరిస్థితులు నెలకొన్నాయి. 1984 ఆగస్టులో బైపాస్ ఆపరేషన్ చేసుకోవడానికి అమెరికా వెళ్లిన అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావును అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ కుట్రలకు పదవీచ్యుతుని చేసింది. ఎన్టీఆర్ కాబినెట్లోని మంత్రి నాదెండ్ల భాస్కర్ రావుతో కలిసి కొందరు ఎమ్మెల్యేలు మెజారిటీ లేకున్నా నాదెండ్లను సీఎం చేయగలిగారు. ఆ తరవాత ఎన్టీఆర్ పోరాటం మూలంగా కేవలం 31 రోజుల్లోనే నాదెండ్ల పదవి కోల్పోయారు. ఆ తర్వాత 1995 ఆగస్టు 23న పార్టీలోని మెజారిటీ శాసనసభ్యులు ఎన్టీఆర్ అల్లుడు నారా చంద్ర బాబు నాయుడుకు మద్దతుగా నిలిచారు. ఆ తదనంతర పరిమాణాల్లో నారా చంద్రబాబునాయుడు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో కొందరు ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం జరిగింది కూడా ఆగస్టు నెలలోనే. ప్రస్తుత పరిస్థితుల్లో సీఎంకు వ్యతిరేకంగా ఎమ్మెల్యేలు ఏకమవ్వడం, బయటనుండి కొందరు నేతలు సైతం ఆ అసమ్మతికి మద్దతు ఇవ్వడం చూస్తుంటే తెలుగు రాజకీయాల్లో మరోసారి ఆగస్టు సంక్షోభం పునరావృతం అవుతుందా అన్న సందేహం నెలకొంది.









తెలుగు ప్రసార మాధ్యమరంగంలో మధురవాణి ఒక ట్రెండ్, ఒక బ్రాండ్, ఒక గొప్ప స్ఫూర్తి. పాతికేళ్ల క్రితం రామోజీ ఫిలిమ్ సిటీలోని ఈటీవీతో మొదలైన ఆమె మజిలీ ఇప్పటికీ అప్రతిహతంగా కొనసాగుతోంది. టీవీ తెరపై కనిపించకుండానే కేవలం తన నేపథ్య స్వరంతో అసాధారణమైన గుర్తింపు తెచ్చుకోవడం ఆమెకే సాధ్యమైంది. గతఇరవయ్యేళ్లుగా ఆమె అనేక మీడియా సంస్థల్లో పనిచేశారు. కొన్ని మీడియా సంస్థలు అయితే ఏరికోరి ఆమె కోసమే ప్రత్యేక బులిటెన్స్ రూపొందించాయంటే ఆమె స్వరానికి ఉన్న క్రేజ్ అర్థం చేసుకోవచ్చు. - (ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్):

# సుస్వరాల రాణి మధురవాణి!

అక్షరానికి ప్రాణం..గళానికి అలంకారం!

తెర వెనుక సరస్వతి.. తెలుగు ప్రసారాల గళ స్ఫూర్తి

వాయిస్ కల్చర్‌లో పీహెచ్‌డీ..

## 6 గంటల్లో.. 6 భాషల్లో 60 పాటలు ప్రపంచ రికార్డ్

- తెలుగు మీడియాలో 'వాయిస్ ఆఫ్ ది క్వార్టర్ సెంచరీ'
- కనిపించకుండానే కోట్లాది మనసులు గెలిచిన వాయిస్ మాంత్రికురాలు
- శంఖంలో పోస్తేనే తీర్థం.. ఆమె పలికితేనే వార్తకు అర్థం
- మధురవాణి 25 ఏళ్ల అప్రతిహత గళ ప్రస్థానంపై 'సిరి న్యూస్' ప్రత్యేక కథనం

### అక్షరానికి ప్రాణం పోసే విలక్షణ శైలి

శంఖంలో పోస్తేనే తీర్థం అన్నట్టుగా, మధురవాణి స్వరంలో పలికితేనే ఒక కథనం మరింత ప్రవర్ధమానం అవుతుంది. వాచకాన్ని చదవడంలో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని అన్వయిస్తూ ప్రజెంట్ చేయడంలో ఆమెకు ఆమెనే సాటి. మానవీయ కథనమైనా, రాజకీయ కథనమైనా.. అందులో ఉండే సారాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకుని ఆమె ప్రజెంట్ చేసే తీరు నభూతో నభవిష్యతి. గంధకం, భాస్వరం కలిస్తే వచ్చే మంటలా ఆమె స్వరంలోని ఉద్వేగ-ఉద్రేకాల మేళవింపు మాటల్లో చెప్పలేనిది. అందుకే ఆమె వన్ అండ్ ఓన్లీ మధురవాణిగా నిలిచారు.

### మానవత్వం.. జీవకారుణ్యం

మధురవాణికి సేవాభావం ఎక్కువే. తన ప్రతి పుట్టినరోజున అన్నదానం చేయడం, వృద్ధులు మరియు అనాథ పిల్లలకు దుప్పట్లు, బట్టలు అందజేయడం ఆమె సంప్రదాయం. వరద బాధితులకు సాయం చేయడమే కాకుండా, రోడ్లపై గాయపడిన మూగజీవాలకు చికిత్స చేయించడం ఆమెలోని గొప్ప సుగుణాన్ని చాటిచెబుతుంది.



### నిరంత విద్యార్థి.. వృత్తి పట్ల అంకితభావం

మధురవాణి కేవలం వాయిస్ ఆర్టిస్ట్ మాత్రమే కాదు, నిరంతర విద్యార్థి కూడా. జర్నలిజంలో ఎమ్సీజె పూర్తి చేసిన ఆమె, ప్రస్తుతం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వాయిస్ కల్చర్ మీద పీహెచ్‌డీ చేస్తున్నారు. అలాగే కూచిపూడి కళాప్రవేశికలో డిప్లొమో కోర్సు పూర్తి చేశారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ఆమె నిర్వహించిన 'రియల్ హీరోస్' ప్రోగ్రామ్ ద్వారా గుర్తింపు లేని నిస్వార్థ సేవకులను సమాజానికి పరిచయం చేశారు. వృత్తి పట్ల ఆమెకున్న డెడికేషన్, కమిట్మెంట్ అద్భుతమైనవి.



### బాల్యం నుంచే కళల పట్ల మక్కువ

మధురవాణి చిన్నతనంలోనే స్కూల్ పోటీల్లో పాల్గొని నాటి గవర్నర్ కుముద్ బెన్ జోషి చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. కాలేజీ రోజుల్లో వక్తృత్వం, నృత్యం, సంగీతం, చిత్రలేఖనంలో ఎన్నో రాష్ట్ర స్థాయి బహుమతులు గెలుచుకున్నారు. ఆకాశవాణి ఆడిషన్ టెస్ట్ ద్వారా మొదలైన ప్రయాణం, ఈటీవీలో న్యూస్ రీడర్‌గా మలుపు తిరిగి, నేడు వాయిస్ ఓవర్ ఆర్టిస్టుగా ఉన్నత స్థాయికి చేరింది. యాడ్ ఫిలిమ్స్, డాక్యుమెంటరీలు, ఫిలిమ్ డబ్బింగ్ ఇలా అన్నింటా ఆమె రాణిస్తున్నారు.

### అవార్డులు.. సత్కారాల పరంపర

దూరదర్శన్‌లో బెస్ట్ న్యూస్ ప్రజెంటర్‌గా గోల్డ్ మెడల్ అందుకున్న మధురవాణికి దక్కిన గౌరవాలు అనంతం. 2005లో అమెరికా తానా సభల్లో సత్కారం, ఆంధ్ర మహిళా సభ పురస్కారం, పద్మ మోహన ఆర్ట్ థియేటర్ ఉత్తమ వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్ అవార్డు, దాసరి కల్చరల్ అకాడమీ ఉగాది పురస్కారం వంటివి ఆమె ఖాతాలో ఉన్నాయి. ఇన్ని పురస్కారాలు ఉన్నా, సింప్లిసిటీయే ఆమె అసలైన అలంకారం.



### ఆరు భాషల్లో ప్రపంచ రికార్డు

మధురవాణిలోని మరో ఆసక్తికర కోణం ఆమె గాత్రం. సినీ సంగీతంలో అపారమైన పట్టున్న ఆమె, ఇటీవల హైదరాబాద్ త్యాగరాయ గానసభలో 6 గంటల్లో-6 భాషల్లో (తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఇంగ్లీష్, అరబిక్)-60 పాటలు పాడి ఐదు ప్రపంచ రికార్డులను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు 'వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డు-2026'తో పాటు వండర్ బుక్, జీనియస్ బుక్, గోల్డెన్ స్టార్ వంటి పలు రికార్డులను అందజేసి ఘనంగా సన్మానించారు. వాయిస్ ఓవర్ కళకే పరిమితం కాకుండా బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణిస్తూ, ప్రసార మాధ్యమ రంగంలో రెండున్నర దశాబ్దాలు పూర్తి చేసుకున్న మధురవాణి గారికి హృదయపూర్వక అభినందనలు!



# ఇస్నాపూర్ మున్సిపల్ సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం

- ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత
- రుద్రారం, పాశంమైలారం, చిట్కుల్ వార్డుల్లో రూ.2.70 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పటాన్ చెరు, ఆగస్టు 21, (సిరి న్యూస్): ఇస్నాపూర్ మున్సిపాలిటీ ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారం, పాశం మైలారం, చిట్కుల్ వార్డుల్లో సుమారు రూ.2.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగు నీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని ప్రతి వార్డును సమానంగా అభివృద్ధి చేయడంతో పాటు, కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తూ.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, మాజీ ఎంపీపీలు శ్రీశైలంఈ యాదవ్, గాయత్రి పాండు, కౌన్సిలర్లు పాండు, సంధ్య నవీన్ రెడ్డి, లత వెంకటేష్, రాజు, ఆంజనేయులు, వెంకటేష్, అరుణ్, కో ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, బాబా, అసీయ బేగం, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుధీర్ రెడ్డి, కృష్ణ, రాజు, బండ రాజు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



సిరి TV
People's Voice
డిజిటల్ ఛానల్
మరియు సిరి మీడియా హౌస్
నూతన కార్యాలయ భవన ప్రారంభోత్సవం సందర్భంగా
సిరి యాజమాన్యానికి మరియు సిబ్బందికి
హార్థిక శుభాకాంక్షలు




With Belt Compliments from :
PATANCHERU CONSTITUENCY



# వర్షమేనా ఈ ప్రాజెక్టు ఆధారమా!

## ప్రాజెక్టు నీరు లేకపోతే రైతుల పరిస్థితి ఏమిటి?

- దిగులుతో రైతన్నలు
- ప్రాజెక్టులో నీటి లేకపోతే మా పరిస్థితి ఏమిటి?
- అన్ని రకాలుగా పంటకు సాగు చేశాం నీరు లేకపోతే ఇబ్బంది

**పాపన్నపేట్ ఆగస్ట్ 21 సిరి న్యూస్**

ఉమ్మడి మెదక్ జిల్లాలో సింగూరు తర్వాత పెద్ద ప్రాజెక్టుగా పిలవబడే ఘనాపూర్ ప్రాజెక్టుకు రాబోయే రోజులలో నీటి సమస్య ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాకాలం పూర్తయినప్పటికీ ఎగువన ఉన్న సింగూరు ప్రాజెక్టులో కేవలం సుమారుగా 5 టీఎంసీలు నీటి నిల్వ ఉండడంతో దిగువ ప్రాంతంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘనాపూర్ ప్రాజెక్ట్ ప్రాంతంలో సుమారుగా వేలాది ఎకరాలకు సాగందించే పెద్ద ప్రాజెక్టుగా పిలవబడే ఈ ప్రాజెక్టులో నీటి నిలువ లేకపోవడంతో వచ్చే నెల నుండి మహబూబ్నగర్ ఫతేనగర్, కెనాల్లకు నీటి సరఫరా ఉండకపోతే కాలువ ద్వారా పంట వేసుకునే రైతులు తీవ్ర ఇబ్బంది పడాల్సి ఉంటుంది. ఇప్పటికే అన్ని రకాలుగా వ్యవసాయానికి సిద్ధమైన రైతులు దిగులు చెందడం, ఒకపక్క వర్షాలు లేక మరో పక్క ప్రాజెక్టులో నీరు లేక రైతులు ఆలోచిస్తూ ఉన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వర్షం రాకపోవడంతో ప్రాజెక్టులో నీళ్లు లేకపోవడం వ్యవసాయ పైన ఆధారపడి రైతులు తీవ్ర ఇబ్బంది పడే అవకాశం ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క ఎండలు మరొక పక్క నీరు లేకపోవడంతో రైతన్నలు ఇబ్బంది పడే పరిస్థితి రాబోయే రోజుల్లో నెలకొని విధంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# విరాహత్ అలీని పరామర్శించిన అరుణోదయ విమలక్క

**రామాయంపేట, ఆగస్టు 21 (సిరి న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే)అధ్యక్షులు ఖాజా విరహత్ అలీ తల్లి బాషారత్ ఉన్నిసా బేగం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క గురువారం గజ్వేల్ పట్టణంలోని విరాహత్ అలీ ఇంటికి చేరుకొని ఆయనతో పాటు కుటుంబ సభ్యులు విరాసత్, విజార్హత్ లను పరామర్శించారు. బాషారత్ ఉన్నిసా బేగం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.



# కొండా సుస్మితా పటేల్‌కు రేవంత్ రెడ్డిపై మాట్లాడే అర్హత లేదు..



- కేసీఆర్‌ను కామారెడ్డిలో ఓడించింది కొండల్ రెడ్డే : నర్సింహారెడ్డి

**రామచంద్రపురం( పటాన్చెరు ), ఆగస్టు 21 (సిరి న్యూస్) :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుల పై మాట్లాడే అర్హత కొండా సుస్మితా పటేల్‌కు లేదని సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొల్కూరి నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న పరకాలలో కొండా సుస్మితా పటేల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరులపై చేసిన వ్యాఖ్యలు బాధ్యతారహితమైనవని నర్సింహారెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావులు కూడా ముఖ్యమంత్రి సోదరుడు ఏనుముల కొండల్ రెడ్డిపై పదేపదే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గత ఎన్నికల్లో కామారెడ్డిలో మాజీ సీఎం కేసీఆర్ ఓటమికి కొండల్ రెడ్డి కీలకంగా వ్యవహరించారనే కక్షతోనే బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. అదే తరహాలో కొండా సుస్మితా పటేల్ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. పార్టీకి నష్టం కలిగించేలా బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేస్తున్న వారిపై ఏఐసీసీ, టీపీసీసీ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు యువరాజ్ మోరే, సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఐదుగుళ్ల పోచమ్మ బోనాలకు ఏర్పాట్లు చేయాలి..



- జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్

**రామచంద్రాపురం, ఆగస్టు 21 (సిరి న్యూస్) :**

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రీశ్రీశ్రీ ఐదుగుళ్ల పోచమ్మ తల్లి ఆలయం వద్ద నిర్వహించనున్న బోనాల ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరుతూ రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా బోనాల సందర్భంగా ఆలయాల వద్ద విద్యుత్ దీపాలు, జనరేటర్లు, పారిశుద్ధ్య చర్యలు, దోమల నివారణకు ఫాగింగ్, చెత్త తొలగింపు తదితర ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. వినతిపత్రంపై స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. తక్షణమే స్పందించి ఏర్పాట్లకు ఆదేశాలు ఇచ్చిన జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్‌కు మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విజయ డైరీ పాల కొనుగోలు ధరలు పెంపు

**మహబూబ్‌నగర్, ఆగస్టు 20**

పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని విజయ డైరీ పెంచిన పాల కొనుగోలు ధరలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో పెంచిన ధరల కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించారు. విజయ డైరీ గేదె పాల కొనుగోలు ధరను లీటరుకు రూ.6, ఆవు పాల ధరను రూ.2 చొప్పున పెంచిందని తెలిపారు. రైతులకు 15 రోజులకోసారి పాల బిల్లుల చెల్లింపు, పశు బీమా, నాణ్యమైన పశుదాణా, ఇతర పశుపోషణ సదుపాయాలు అందిస్తున్నట్లు చెప్పారు.

# వరలక్ష్మీవ్రతాలతో మహిళల సందడి





**రామాయంపేట, ఆగస్టు 21 (సిరి న్యూస్)**

శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా రామాయంపేట మండలంలో మహిళలు వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వరలక్ష్మి వ్రతానికి విశిష్టమైన స్థానం ఉండటంతో ఉదయం నుంచే పలు ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు ఇళ్లను శుభ్రం చేసి మామిడి తోరణాలు, పూలతో అలంకరించి ప్రత్యేక పూజా మండపాలను ఏర్పాటు చేశారు. వరలక్ష్మీ దేవిని కలశ రూపంలో ప్రతిష్ఠించి పూలు, పసుపు, కుంకుమతో అందంగా అలంకరించారు. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేసి పండ్లు, పిండి వంటలు, తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం వరలక్ష్మి వ్రత కథను చదివి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. అష్టలక్ష్ముల్లో వరలక్ష్మి దేవికి ప్రత్యేక స్థానం ఉందని, వ్రతాన్ని ఆచరించడం ద్వారా కుటుంబంలో సుఖసంతోషాలు, ఐశ్వర్యం, శ్రేయస్సు కలుగుతాయని మహిళలు విశ్వసిస్తారు. కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ఇంటిల్లిపాదికీ అమ్మవారి అనుగ్రహం లభించాలని ప్రార్థించారు. వ్రత పూజలు పూర్తయిన అనంతరం మహిళలు ఒకరినొకరు పసుపు, కుంకుమ, తాంబూలం అందించుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పలుచోట్ల మహిళలు సమూహాలుగా చేరి భక్తి పాటలు పాడుతూ వ్రత కార్యక్రమాలను నిర్వహించడంతో శ్రావణ శుక్రవారం మండలంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, వరలక్ష్మి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న ఎనిశెట్టి రమణ, అర్చన దంపతుల నివాసంలో ప్రతి సంవత్సరం నిర్వహించే వరలక్ష్మీ వ్రత కార్యక్రమం ఈ ఏడాది కూడా వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, వ్రత కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సౌభాగ్యం కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. వ్రతం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## పర్స శ్యామ్‌రావు ఇంట ఘనంగా వరలక్ష్మి వ్రతం



- భక్తిశ్రద్ధలతో పూజలు.. పాల్గొన్న ఉస్మాన్‌నగర్ వాసులు, ప్రముఖులు

**రామచంద్రపురం, ఆగస్టు 21 (సిరి న్యూస్) :**

శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్స శ్యామ్‌రావు దంపతులు ఉస్మాన్‌నగర్‌లోని తమ నివాసంలో వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. పర్స శ్యామ్‌రావు, పర్స పద్మ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా ఉస్మాన్‌నగర్ వాసులను తమ నివాసానికి ఆహ్వానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పాల్గొని శ్యామ్‌రావు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. తెల్లాపూర్‌కు చెందిన పలువురు ప్రముఖులు, డివిజన్ ప్రజలు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా పర్స శ్యామ్‌రావు నివాసంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## ఆర్కిటిక్‌లో రక్షణ బలోపేతం చేసిన నార్వే

**ఓస్లో, ఆగస్టు 21**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఉత్తర ఐరోపాలో భద్రతాపరమైన ఆందోళనలు పెరుగుతున్న వేళ, NATO సభ్యదేశమైన నార్వే ఆర్కిటిక్ ప్రాంతంలో తన సైనిక సామర్థ్యాన్ని భారీగా పెంచుతోంది. ఇటీవల ఏర్పాటు చేసిన *ఫిన్‌మార్క్ బ్రిగేడ్ (Finnmark Brigade)*ను విస్తరిస్తూ అదనపు ఆయుధ, వైమానిక రక్షణ వ్యవస్థలను సమకూర్చింది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత నార్వే ఏర్పాటు చేసిన తొలి కొత్త బ్రిగేడ్ ఇదే. గత ఏడాది ఏర్పాటైన ఫిన్‌మార్క్ బ్రిగేడ్ దేశంలోని రెండో సైనిక బ్రిగేడ్‌గా ఉంది. రష్యాతో నార్వేకు ఉన్న సుమారు 198 కిలోమీటర్ల సరిహద్దుపై నిఘా, గస్తీ నిర్వహించడం దీని ప్రధాన బాధ్యతల్లో ఒకటి. తాజా విస్తరణలో భాగంగా బ్రిగేడ్‌కు ఆర్టిలరీ బెటాలియన్, ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీ, కమ్యూనికేషన్స్ కంపెనీలను జోడించారు. దీంతో దాదాపు 40 కిలోమీటర్ల దూరంలోని భూభాగ లక్ష్యాలపై దాడి చేయడంతో పాటు నార్వే, NATO యుద్ధ విమానాలు, నౌకలతో సమన్వయంతో సైనిక చర్యలు చేపట్టే సామర్థ్యం పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఫిన్‌మార్క్ బ్రిగేడ్ ప్రధాన కార్యాలయం పోర్సాంగ్‌మోయెన్ ప్రాంతంలో ఉంది. ఇది రష్యా సరిహద్దుకు






# డిజిటల్ టెక్నాలజీల ఏకీకరణతో సామర్థ్యాన్ని పెంచొచ్చు





- **ఐఎన్ఎస్ విశ్వకర్మలో ఏఐ-ఆధారిత నావికా ఇంజనీరింగ్ పై గీతం ప్రొఫెసర్ ప్రసంగం**

**పటాన్ చెరు, ఆగస్టు 21, (సిరి న్యూస్)**

డిజిటల్ టెక్నాలజీ ల ఏకీకరణ ద్వారా తెలివైన సముద్ర వ్యవస్థలను ఎలా ఏర్పాటు చేయవచ్చో, కార్యాచరణ సామర్థ్యాన్ని ఎలా పెంచవచ్చో, వేగవంతమైన, మరింత సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి ఎలా తోడ్పడగలదో ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్ వివరించారు. హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ప్రీతి, భారతీయ యుద్ధ నౌక ఐఎన్ఎస్ విశ్వకర్మలో 'ఏఐఆధారిత నావికా ఇంజనీరింగ్: స్మార్ట్ షిప్పులు, ప్రిడిక్టివ్ మేనేజ్ మెంట్, అటానమస్ సిస్టమ్స్' అనే అంశంపై ఇటీవల విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. నావికా ఇంజనీరింగ్, సముద్ర కార్యకలాపాల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి), ప్రిడిక్టివ్ అనలిటిక్స్ పోషిస్తున్న పరివర్తనాత్మక పాత్రను ఈ ఉపన్యాసం విశ్లేషించింది. ఈ ప్రసంగంలో స్మార్ట్ షిప్పుల భావన ఒక ముఖ్యమైన అంశం. ఇందులో పరస్పరం అనుసంధానించిన సెన్సార్లు, తెలివైన కంప్యూటింగ్ వ్యవస్థలు, రియల్ టైమ్ డేటా అనలిటిక్స్ నిరంతర పర్యవేక్షణకు, తెలివైన నిర్ణయాలు తీసుకోవడానికి దోహదపడతాయని ఆమె అభిప్రాయ పడ్డారు. ప్రొఫెసర్ పర్వేకర్, ఏఐఆధారిత ప్రిడిక్టివ్ మేనేజ్ మెంట్, మెయింటినెన్స్ గురించి కూడా చర్చించారు. డేటా అనలిటిక్స్ ద్వారా నమూనాలను ఎలా గుర్తించవచ్చో, సంభావ్య సిస్టమ్ వైఫల్యాలను ఎలా ముందుగానే ఊహించవచ్చో, ప్రొయాక్టివ్ మెయింటినెన్స్ ను ఎలా సాధ్యం చేయవచ్చో ఆమె వివరించారు. తద్వారా విశ్వసనీయతను, కార్యాచరణ సంసిద్ధతను మెరుగు పరచ వచ్చని తెలిపారు. నావిగేషన్, నిఘా, పర్యవేక్షణ, నిర్ణయ సహాయం, ఇతర సంక్లిష్ట సముద్ర కార్యకలాపాలలో అటానమస్ సిస్టమ్స్ యొక్క పెరుగుతున్న సామర్థ్యాన్ని ఈ సెషన్ మరింతగా పరిశీలించింది. సురక్షిత, తెలివైన, మరింత సమర్థవంతమైన నావికా వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి, ఏఐని అధునాతన సెన్సింగ్, కమ్యూనికేషన్, అటానమస్ టెక్నాలజీల తో అనుసంధానించడం ఒక ముఖ్యమైన మార్గంగా స్పష్టీకరించింది. సముద్ర, రక్షణ వినియోగం, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక అవసరాలను తీర్చడంలో అంతర్ విభాగాల విధానాల ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, కృత్రిమ మేధస్సు, నావికా ఇంజనీరింగ్ కలయికను అన్వేషించడానికి ఈ ప్రసంగం ఒక ఆసక్తికరమైన వేదికను అందించింది. తెలివైన, అటానమస్ సిస్టమ్స్ లో పరిశోధన, ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడంలో విద్యా సంస్థలు, సాంకేతికత, రక్షణ సంస్థల మధ్య బలమైన సహకారం ప్రాముఖ్యతను ప్రొఫెసర్ పర్వేకర్ నొక్కి చెప్పారు. తదుపరి తరం స్మార్ట్, స్థితిస్థాపక, అటానమస్ సముద్ర వ్యవస్థలకు ఏఐఆధారిత సాంకేతికతలు గణనీయంగా దోహదపడగలవనే సామర్థ్యాన్ని ఈ ఉపన్యాసంలో నిర్ధారించారు.

# సింధు ఆదర్శ్ రెడ్డి ఇంట ఘనంగా వరలక్ష్మీ వ్రతం..



**రామచంద్రపురం, ఆగస్టు 21 (సిరి న్యూస్) :**

పవిత్ర శ్రావణ శుక్రవారం సందర్భంగా భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి సింధు ఆదర్శ్ రెడ్డి తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, శాంతి, సంతోషాలు వెల్లివిరియాలని, అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.



# చేయూత పింఛన్లకు దరఖాస్తూ చేసుకోవాలి

- **దరఖాస్తుల సమస్యల పరిష్కారం కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు. 8008556112.**
- **ఈనెల 26వ తేదీన దివ్యాంగులకు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ప్రత్యేక యు.డి.ఐ.డి శిబిరం.**
- **మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



**మెదక్ ఆగష్టు,21(సిరి న్యూస్)**


చేయూత పింఛన్ల దరఖాస్తుల పరిష్కారం కోసం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు,జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 26వ న దివ్యాంగుల కొరకు ప్రత్యేక యు.డి.ఐ.డి శిబిరం నిర్వహిస్తున్న మన్నారు.చేయూత పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ పై జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ కొత్త చేయూత పింఛన్లు దరఖాస్తులు మండల మరియు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైన ఎడల వెంటనే దరఖాస్తుదారులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గల 8008556112 చేయూత పెన్షన్లు హెల్ప్ డెస్క్ నెంబర్ ను సంప్రదించాలన్నారు. ఇంకా ఎవరైనా దివ్యాంగులు యూ డి ఐ డి ధ్రువీకరణ పత్రం లేనియెడల వారు తక్షణమే మీసేవ సెంటర్లో దరఖాస్తు చేసుకున్నట్లయితే ఆగస్టు 26వ తేదీన మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో GGHలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇంకా మిగిలి ఉన్న వారు మీసేవ సెంటర్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పింఛన్ల కొరకు దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఏదైనా ధృవీకరణ పత్రం లేనియెడల వెంటనే సంబంధిత అధికారుల దగ్గరకు వెళ్లి తక్షణమే తీసుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ధ్రువీకరణ పత్రాలు తీసుకునేటప్పుడు ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే కలెక్టరేట్లో ఉన్న హెల్ప్ డెస్క్ సహాయకారిణిగా పనిచేస్తుందని,సమస్య ఉన్నట్లయితే వెంటనే హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలన్నారు. లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులను సకాలంలో తీసుకొని వెంటనే ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని సంబంధిత ఎంపీడీఓ లను కలెక్టర్ ఆదేశించారు.

# ఖేలో ఇండియా క్రీడారంగానికి గేమ్ ఛేంజర్: జ్వాలా గుత్తా

**హైదరాబాద్, ఆగస్టు 21 :**

కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించిన ఖేలో ఇండియా పథకం (2026-31) దేశ క్రీడారంగంలో కీలక మార్పులు తీసుకురానుందని ఒలింపియన్ జ్వాలా గుత్తా అన్నారు. ఈ పథకానికి రూ.29,054 కోట్లు కేటాయించగా, క్రీడాకారులకు అందించే సహాయాన్ని భారీగా విస్తరించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 33 ఖేలో ఇండియా కేంద్రాల్లో 601 మందికి పైగా క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. రాష్ట్రంలో 19 గుర్తింపు పొందిన అకాడమీలు పనిచేస్తుండగా, 127 అస్మితా లీగ్‌లలో 20,921 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ఒలింపిక్ స్థాయి వరకు ప్రతిభను తీర్చిదిద్దడమే పథకం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ ఏడాది చివర్లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది.





## కార్మికుల చందాలు కోట్లలో.. ESIలో వైద్యం కొరతలో!

- **2.44 లక్షల మంది ఐపీ లకు కనీస వైద్యం కరువు..**
- **బకాయిలతో ESI సేవలకు బ్రేక్**
- **సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం: సీఐటీయూ**

**రామచంద్రాపురం, ఆగస్టు 21 (సిరి న్యూస్):**

రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రి, పరిధిలోని ఎనిమిది ఈఎస్ఐ డిస్పెన్సరీ ల్లో గత ఆరు నెలలుగా మందుల కొరత, రెండేళ్లుగా శస్త్రచికిత్సకు అవసరమైన సామగ్రి కొరత కొనసాగుతోందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు పాం దురంగారెడ్డి ఆరోపించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ప్రతినిధులు సెక్రటేరియట్‌లో ఈఎస్ఐ రాష్ట్ర వైద్య సంచాలకురాలు దాసరి హరిచందనకు వినతిపత్రం అం దజేశారు. రామచంద్రాపురం ఈఎస్ఐ నోడల్ కేంద్రం పరిధిలో సుమారు 2.44 లక్షల మంది బీమా లబ్ధిదారులు ఉన్నార ని, పటాన్‌చెరువు, ఇస్నాపూర్, పాశామై లారం తదితర పారిశ్రామిక ప్రాంతాల కార్మికులు ఈఎస్ఐ వైద్య సేవలపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. కొన్ని డిస్పెన్సరీల్లో రక్తపోటు, మధుమేహం మందులతో పాటు సాగే పట్టీలు, నడుము బెల్టు, మోకాలి రక్షణ పట్టీలు వంటి శస్త్ర చికిత్స సామగ్రి కూడా అందుబాటులో లేదన్నారు. రక్తాన్ని పరీక్షించే ఆటోమేటెడ్ యంత్రం సుమారు రూ.65 వేల వార్షిక నిర్వహణ బకాయిల కారణంగా పనిచే యడం లేదని, ఎక్స్‌రే చిత్రాల సరఫరా కూడా బకాయిలతో నిలిచిపోయిందని ఆరోపించారు. హెచ్‌బీఏ 1సీ, సీరమ్ క్రి యాటినిన్, థైరాయిడ్, కాలేయ పనితీరు, మూత్రపిండాల పనితీరు, మూత్రం, మలేరియా, డెంగ్యూ తదితర పరీక్షల కు అవసరమైన పరీక్షా పరికరాలు, రసాయన ద్రావణాలు కూడా అందుబా టులో లేవన్నారు. "కార్మికుల నుంచి కోట్ల రూపాయల చందాలు వసూలు చేస్తున్నా.. అదే కార్మికులకు కనీస వైద్య సదుపా యాలు అందకపోవడం దురదృష్టకరం. మందులు, శస్త్రచికిత్స సామగ్రి, పరీక్షా సదుపాయాలను వెంటనే అందుబాటులో కి తీసుకురావాలి" అని పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరిం చకపోతే పటాన్‌చెరువు ప్రాంత పారిశ్రా మిక కార్మికులను సమీకరించి ధర్నాలు, నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు ఎండీ వాజిద్ అలీ, ఈఎస్ఐ బోర్డు మాజీ సభ్యులు బి. అర్జున్, సాండ్విక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి. ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రులకు సామాజిక పింఛన్

- **హెల్త్‌కార్డులో పేర్లున్నా.. అర్హతల పరిశీలన ఏది**
- **ముందస్తు వెరిఫికేషన్ లేకుండానే దరఖాస్తుల స్వీకరణ..**

**మెదక్, ఆగస్టు 21 సిరి న్యూస్**



జిల్లాలో సామాజిక పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ, అర్హతల పరిశీలన వ్యవహారం చర్చనీయాం శంగా మారింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సామాజిక పింఛన్ పొందేందుకు అర్హతలను క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించాల్సి ఉండగా.. కొన్ని గ్రామాల్లో ముందస్తు వెరిఫికేషన్ లేకుండానే దరఖాస్తులను స్వీకరిస్తున్నారనే ఆరోపణలు వినిపి స్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదం డ్రులు సామాజిక పింఛన్ పొందుతున్నారు అనే అంశం జిల్లాలో చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ వివరాలు హెల్త్‌కార్డులు, ఆహార భద్రత కార్డులు, ఇతర ప్రభుత్వ రికార్డుల్లో అందుబాటులో ఉన్నప్పటికీ.. సామాజిక పింఛన్ దరఖాస్తుల పరిశీలనలో వాటిని పరిగణనలోకి తీసుకుంటున్నారా లేదా అనే సందేహాలు వ్యక్తమ వుతున్నాయి. ఒక ఉద్యోగి హెల్త్‌కార్డులో తల్లిదం డ్రుల పేర్లు కుటుంబ సభ్యులుగా నమోదై ఉండి, వారికి ఉద్యోగి ద్వారా వైద్య ప్రయోజనాలు అం దుతున్నట్లయితే.. అదే తల్లిదండ్రులు సామాజిక పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్న సందర్భంలో ఆ వివరాలను అధికారులు తప్పనిసరిగా సరిపోల్చి చూడాల్సిన అవసరం ఉంది.

**రికార్డులు పరిశీలిస్తున్నారా**

ప్రభుత్వ ఉద్యోగి హెల్త్‌కార్డులో తల్లిదండ్రుల పేర్లు ఉన్నాయా వారు ఉద్యోగిపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యులుగా నమోదయ్యారా ఆహార భద్రత కార్డులో వారి పేర్లు ఎవరితో కలిసి ఉన్నాయి కుటుంబానికి ఉన్న భూములు, ఆస్తులు, ఆదాయ వనరులు ఏమిటి అనే వివ రాలను పరిశీలించాల్సి ఉంది. ఈ రికార్డులను సామాజిక పింఛన్ దరఖాస్తుతో అనుసంధానం చేసి పరిశీలిస్తేనే వాస్తవ అర్హత స్పష్టమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగి కుటుంబానికి సంబంధించిన సమాచారం ఒక శాఖలో, పింఛన్ దరఖాస్తు మరో శాఖలో ఉండటం వల్ల అనర్హతలు గుర్తించ కుండా దరఖాస్తులు ముందుకు వెళ్లే పరిస్థితి ఏర్ప డకూడదు. సంబంధిత శాఖల వద్ద ఉన్న వివరా లను పరస్పరం సరిపోల్చి పరిశీలించే విధానం ఉంటే అర్హత లేని దరఖాస్తులను ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం ఉంటుంది.

**గ్రామస్థాయిలోనే పరిశీలన జరగాలి**

సామాజిక పింఛన్ దరఖాస్తు స్వీకరించే సమ యంలోనే గ్రామస్థాయి అధికారి కుటుంబ పరిస్థితిని పరిశీలించాల్సిన అవసరం ఉంది. దరఖాస్తు తీసుకుని.. 'తర్వాత అధికారులు వెరి ఫికేషన్ చేస్తారు' అంటూ బాధ్యతను తదుపరి దశకు వదిలేయడం వల్ల అసలు వాస్తవాలు వెలుగులోకి రాకపోవచ్చనే అభిప్రాయాలు వ్య క్తమవుతున్నాయి. దరఖాస్తుదారుడి కుటుంబ పరిస్థితిపై అనుమానం ఉన్నప్పుడు సంబంధిత రికార్డులను పరిశీలించడంతో పాటు అవసరమై తే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి. ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రుల దరఖాస్తుల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహ రించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగి వివరాలు, హెల్త్‌కార్డు, ఆహార భద్రత కార్డు, కుటుంబ సభ్యుల వివరాలు, భూముల రికార్డులు, ఆదాయ పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన తర్వాతే అర్హ తపై నిర్ణయం తీసుకోవాలి.

**భూములు ఉన్న కుటుంబాలపైనా ఆరా**

జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో గణనీయమైన భూములు ఉన్న కుటుంబాల నుంచి కూడా సామాజిక పింఛన్ కోసం దరఖాస్తులు వస్తున్న ట్లు సమాచారం. ఒక కుటుంబానికి సుమారు మూడు ఎకరాల సాగుభూమితో పాటు మరో ఏడున్నర ఎకరాల మెట్ట భూమి ఉన్నప్పటికీ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు స్థానికం గా చర్చ జరుగుతోంది. ఈ వివరాలను అధికా రిక భూ రికార్డులతో పరిశీలించి వాస్తవ పరిస్థితి ని నిర్ధారించాల్సిన అవసరం ఉంది.

అయితే కేవలం భూములు ఉన్నాయనే కారణం తోనే దరఖాస్తుదారుడిని అనర్హుడిగా ప్రకటిం చకుండా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం భూమి, ఆదాయం, కుటుంబ పరిస్థితి తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలి. సామాజిక పింఛన్ పథకం నిజమైన పేదలు, బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించేం దుకు ఉద్దేశించినది. అర్హులైన వారికి పింఛన్ అందకుండా అనర్హులకు ప్రయోజనం కలిగితే పథకం లక్ష్యం దెబ్బతినే అవకాశం ఉంది. అం దువల్ల దరఖాస్తు స్వీకరణ దశ నుంచే పారదర్శ కంగా పరిశీలన చేపట్టి, ప్రతి దశలో అధికారుల బాధ్యతను స్పష్టంగా నిర్ధారించాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రులు సామాజిక పింఛన్ పొందుతున్నారనే ఆరోపణలపై అధికా రికంగా సమగ్ర విచారణ జరిపితే.. ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు ఎంతమందికి అర్హత ఉంది?ఎంతమందికి ఇప్పటికే పింఛన్ అందుతోంది అనే వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. జిల్లా యంత్రాంగం దీనిపై దృష్టి సారించి వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది.

**ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి**

ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు గ్రామాల వారీగా సామాజిక పింఛన్ దరఖాస్తులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రుల పేర్లతో ఉన్న దరఖాస్తులను ఉద్యోగి హెల్త్‌కార్డు, కుటుంబ వివరాలు, ఆహార భద్రత కార్డు, భూముల రికార్డులు, ఆదాయ వనరులతో సరిపోల్చి చూడాలని సూచిస్తున్నారు.






# ఫోటోగ్రఫీ కూడా ఓ చరిత్ర రచనే....

- **మీరు ఫోటోను కేవలం తీయరు దానిని సృష్టిస్తారు**
  **- యాన్సిల్ ఆడమ్స్**
- **ఫోటోగ్రఫీ అనేది ఒకే రేఖపై తల, కన్ను, హృదయాన్ని ఉంచడం.**
  **- హెన్రీ కార్టియర్ బ్రెసన్**
- **ప్రపంచంలో ప్రఖ్యాత ఫోటోగ్రాఫర్లు ఇలా ఎన్నో నిర్వచనాలను ఇచ్చారు.**

క్షణాల్లో మారిపోయే సంఘటనలను సరైన సమయంలో బంధించటం అన్నది ప్రత్యేకంగా ఫోటో జర్నలిస్టులకు సవాల్ గా ఉంటుంది. మానసిక ఒత్తిడి పెంచుతుంది. రాస్తారోకోలు, ధర్నాలు ,రకరకాల నిరసనలు జరుగుతున్న సందర్భంలో, ఆ నిరసనలు ఎటు దారితీస్తాయోనని క్షణక్షణం పరిశీలనలో ఉంచుకుంటూ చూపుడు వేలును కెమెరా పై పెట్టి 'క్లిక్ 'అనిపించేందుకు సిద్ధంగా ఉంటాడు. కెమెరాకు కన్నుగా మారి ముందూ వెనుక చూసుకోకుండా యుద్ధరంగంలో సైనికునిలా మారిపోతాడు. అట్లా ఉంటూ ఆ ఘటనను పట్టిచూపే ఫోటోను బంధించి మనకందిస్తాడు. ఇప్పుడు వృత్తిపరమైన ఫోటో జర్నలిస్ట్ లకు స్మార్ట్ ఫోన్ల ప్రభావం,ఏ.ఐ తో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటో జర్నలిజం ఎదిగిన తీరు ,ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్ళను ఒకసారి పరిశీలిద్దాం.

1880 లో పత్రికలలో వ్యాసాలతో పాటు నేరుగా ఫోటోలను ముద్రించే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది.ఇది ఫోటో జర్నలిజానికి పునాది వేసిందని చెప్పుకోవచ్చు. రాసిన వాటిని అర్థంచేసుకోవాలంటే చదవడం రావాలి కానీ! ఫోటో మాత్రం ఏ చదువు లేకున్నా అంతా అర్థం చేయిస్తుంది.లక్ష మాటలు చెప్పలేని విషయాన్ని ఒక్క ఫోటో చెప్పేస్తుంది. అందుకే ఫోటో జర్నలిజానికి ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ ఆదరణ తగ్గలేదు. ఒక ఫోటో జర్నలిస్ట్ సమాజం పట్ల బాధ్యతాయుతంగా, నిజాయితీగా మరియు మానవత్వంతో ఉండాలి. సమాజంలో జరిగే వాస్తవాలను ఎలాంటి వక్రీకరణలు లేకుండా దృశ్య రూపంలో ప్రజల ముందుంచడమే వారి ప్రధాన కర్తవ్యంగా భావించాలి.ప్రింట్ మీడియా పడిపోవడం ,ప్రకటనల రాబడి అంతగా లేకపోవడం ,సోషల్ మీడియా ప్రభావం ఇప్పుడు ఫోటో జర్నలిస్టుల మీద అమితంగా పడుతోంది. కెమెరాను కనిపెట్టి ప్రపంచ మానవాళికి ఒక అద్భుత కానుక ఇచ్చిన లూయిస్ డాగ్యురే జన్మ దినోత్సవాన్ని ప్రతి ఏటా ఆగస్టు 19 ని ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవంగా జరుపుకుంటాం.ఫోటో ఇప్పుడు సర్వాంతర్యామి. కలంపట్టి రాసే జర్నలిస్ట్ ,కెమెరా పట్టి దృశ్యంగా వార్తను మల్చే ఫోటో జర్నలిస్టులు ఇప్పుడు కృత్రిమ మేధ ,సోషల్ మీడియా వెల్లువతో కొన్ని ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ప్రపంచ వ్యాప్తంగా ఫోటో జర్నలిజానికి ఆదరణ పెరుగుతుందే తప్ప తగ్గదు. 1848 లో ఫ్రాన్స్ విప్లవ సమయంలో తీసిన బారికేడ్ల ఫోటోను మొదటి " న్యూస్ ఫోటోగా " చరిత్ర చెపుతోంది. ఇక అప్పటి నుంచి ఈ 178 సంవత్సరాల చరిత్రలో ఫోటో జర్నలిజం సమాచార రంగంలో ఎంతో కీలకంగా మారింది.ఇక ఆ తర్వాత 1925 లో ' లైకా 'అనే చిన్న 35 ఎం.ఎం. కెమెరా మార్కెట్ లోకి వచ్చింది.దీంతో ఫోటో జర్నలిజంలో వేగం పెరిగింది. సులభంగా ఫోటోలను తీసి పత్రికలకు అందివ్వడం మొదలు పెట్టారు. 193050 మధ్య కాలాన్ని ఫోటో జర్నలిజానికి స్వర్ణ యుగం అని చెప్పుకోవచ్చు. లైఫ్ , లుక్ , లాంటి అంతర్జాతీయ పత్రికలు కేవలం ఫోటోలతోనే కథనాలను ప్రచురించి పాఠకులకు దగ్గరయ్యాయి.



రోజర్ ఫెంటన్ అనే ఫోటో జర్నలిస్ట్ మొట్టమొదటి సారిగా యుద్ధరంగంలోకి వెళ్ళి ఫోటోలు తీశాడు. యుద్ధ భూమి ఎట్లా ఉంటుందో ఆయన తొలిసారిగా ప్రపంచం ముందుంచాడు. 1853 నుంచి మూడేండ్ల పాటు ఆయన తన ప్రాణాలకు తెగించి క్రిమియన్ యుద్ధాన్ని మన కళ్ళకు కట్టినట్లు చూపించాడు.

ఇక బాంబు దాడివల్ల ఒంటిపై బట్టలు కాలిపోగా భయంతో ఏడుస్తూ పరిగెడుతున్న తొమ్మిదేళ్ళ కిమ్ ఫుక్ అనే బాలిక ఫోటోను నిక్ ఉట్ 1972 లో తీశాడు.ఈ ఒక్క ఫోటో సామ్రాజ్యవాద అమెరికాను గడగడలాడించింది.వియత్నాం తో తక్షణమే యుద్ధాన్ని ఆపాలని అమెరికాలో నిరసనలు వెల్లువెత్తాయి.ఒకరకంగా చెప్పాలంటే నిక్ ఉట్ ఫోటో యుద్ధాన్ని ఆపిందనే చెప్పుకోవాలి. దీంతో ఒక ఫోటో జర్నలిస్ట్ సత్తా ప్రపంచానికి మొదటిసారిగా తెలిసింది.

ప్రాంతాలు వేరైనా ,భాషలు వేరైనా ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి సందర్భాలు ఎన్నో ఎన్నెన్నో. ఇక మన భారతదేశంలో ఫోటో జర్నలిస్టు అంటే రఘురాయ్ గుర్తుకొస్తారు.ఒకరకంగా చెప్పాలంటే భారతదేశంలో ఆధునిక ఫోటో జర్నలిజానికి రఘురాయ్ పితామహునిగా చెప్పుకుంటారు.సివిల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఈయన తన అన్న ప్రభావంతో ఈ రంగంలోకి అడుగుపెట్టారు. ఎనభై మూడవ ఏట ఈ ఏడాది ఏప్రిల్ 26 న ఆయన అరవై ఏండ్ల ఫోటో జర్నలిజపు ప్రయాణాన్ని ముగించుకుని శాశ్వత నిద్రలోకి వెళ్ళిపోయారు.

గత ఆరు దశాబ్దాలుగా భారతదేశ సామాజిక, రాజకీయ, మరియు సాధారణ ప్రజల జీవితాలను తన కెమెరాతో అద్భుతంగా ఆవిష్కరించారు.1984 లో భోపాల్ గ్యాస్ దుర్ఘటన జరిగిన యూనియన్ కార్బైడ్ గ్యాస్ లీక్ విపత్తును రఘు రాయ్ అత్యంత హృదయ విదారకంగా రికార్డ్ చేశారు.కళ్ళు తెరిచి ఉన్న ఒక పసిబిడ్డను మట్టిలో పూడ్చిపెడుతున్న దృశ్యం ప్రపంచాన్ని కుదిపేసింది. ఈ ఒక్క ఫోటో పారిశ్రామిక నిర్లక్ష్యానికి, మానవ వేదనకు ప్రపంచవ్యాప్త చిహ్నంగా మారింది. గ్యాస్ ప్రభావంతో ఎన్నో రుగ్మతలకు గురైన వారిని, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల కష్టాలను ఆయన సిరీస్‌గా డాక్యుమెంట్ చేశారు. ఒకరకంగా చెప్పాలంటే భారతదేశపు ఆత్మను తన కెమెరాతో బంధించిన మనకాలపు మహోన్నత ఫోటో జర్నలిస్ట్ రఘురాయ్.తన జీవిత కాలంలో 50 కి పైగా ఫోటో పుస్తకాలను ప్రచురించారు.

ఇక సునీల్ జనహ్ ,పాల్ లూయిస్ లుకూడా ఫోటో జర్నలిజాన్ని కొత్తపుంతలు తొక్కించారు.కేవలం వార్తల కోసం కాకుండా చరిత్రను నిర్మించే కోణంలో ఫోటోగ్రఫీ ని ఒక రాజకీయ,సామాజిక ఆయుధంగా మల్చుకున్నారు. బెంగాల్ కరవు ,తెభాగా పోరాటం , అనేక కార్మికోద్యమాల తీవ్రతను సునీల్ జనహ్ ఫోటోలు ప్రపంచానికి చాటాయి.కార్మికుల ,శ్రామికుల జీవితాల్లోని వాస్తవికతకు ఈయన ఫోటోలు ప్రతిబింబాలుగా నిల్చాయి. ఇక పాల్ లూయిస్ ఫోటోలు దేశంలోని గిరిజన,రైతాంగ పోరాటాలను ,పెట్టుబడిదారీ విధానాల వల్ల నలిగిపోతున్న పేదల వేదనను పట్టి చూపాయి.

మరి మన తెలంగాణ ఫోటో జర్నలిస్ట్ ల చరిత్రా తక్కువేమీ కాదు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో వీరి పాత్ర వెలకట్టలేనిది. ఒక చారిత్రక ఘట్టాన్ని తెలంగాణ ఫోటో జర్నలిస్టులు తనివితీరా తమ కెమెరాతో రికార్డ్ చేసి మన ముందుంచారు.జర్నలిస్ట్ లు రాసిన వార్తలు ,నాయకుల ఉపన్యాసాలు ,కళాకారుల ఆట పాటలకు ఏమాత్రం తీసిపోని కృషి వీరిది. మిలియన్ మార్చ్ , సాగరహారం , ఛలో అసెంబ్లీ ,సడక్ బంద్ , రైల్ రోకో ,రాస్తారోకో అన్నింటికీ మించి వంటవార్పు, ఇలా నిరసన ఏదైనా పొద్దున్నే పత్రికల్లో ఫోటోలు చూసిన పాఠకుల్లో ఉద్యమ తీవ్రతను పెంచాయనడంలో ఏమాత్రం సందేహం లేదు.నిలువెల్లా కాలి బూడిదైపోయిన శ్రీకాంతా చారి ఫోటో చూసి యావత్ తెలంగాణా చలించిపోయింది ,కన్నీరుమున్నీరైంది. ఇలా ఆనాటి ఉద్యమ ఘట్టాలను ఫోటోల రూపంలో నేటికి మన ముందు సజీవంగా ఉంచారంటే అది మన ఫోటో జర్నలిస్ట్ ల ఘనతే. ఇప్పుడు ఫోటో జర్నలిస్ట్ ల భవిష్యత్ అనేక సవాళ్ళతో కూడుకుని ఉన్నది. కృత్రిమ మేధ సృష్టిస్తున్న చిత్రాల కాలంలో నిజమైన ,విస్వసనీయమైన ఫోటోలకు విలువ పెరిగింది. వృత్తి పరంగా ఎదుర్కొంటున్న సమస్యలే కాక ,ఆర్థికంగా నిలదొక్కుకునే మార్గం , ఫోటో జర్నలిస్ట్ లను కాపాడుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. పేరు గొప్ప కానీ జీవనం దుర్భరంగా ఉంది వీరిది.

సమస్యలు ఎన్ని ఉన్నా వృత్తి నిబద్ధతను మాత్రం వీడకుండా ముందుకు సాగాలి. సమాజ నిర్మాణంలో మీ పాత్రను మీరు పోషించాల్సిందే. ఇది సమాజం మీపై పెట్టిన బాధ్యత అనుకోండి. సమాజంలో జరిగే వింతలు విశేషాల కంటే , నాయకుల సభలు సమావేశాల కంటే, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన దృష్టి నిలపాల్సిన సందర్భం ఇది అని గుర్తించండి. వ్యవసాయ రంగంలో మహిళలు పడుతున్న కష్టం , మైనింగ్ లో కార్మికుల బాధలు,ఇటుక బట్టీలలో నలిగిపోతున్న బాల్యం , మురికి వాడల్లో చితికి పోతున్న బతుకులు ,వీధి వ్యాపారుల వెతలు ఇలా సహస్ర వృత్తుల్లో సమస్యలు పోగుపడి ఉన్నాయి. వీటిపై కెమెరా కన్ను పడాలి.సమాజాన్ని అత్యంత ప్రభావితం చేయగల శక్తివంతులైన ఫోటో జర్నలిస్ట్ లు మరింత స్ఫూర్తితో ముందుకు సాగాలి , మంచి సమాజ నిర్మాణంలో మీ వంతు కృషిని మీరు చేయాలి.



పి.వి.రావు
సీనియర్ జర్నలిస్ట్
9010153065

## ఒక్క బస్సుతో విద్యార్థుల పాట్లు






- **ఆగని ఆర్టీసీ సర్వీసు..**
- **పాఠశాల, కళాశాలలకు వెళ్లేందుకు అవస్థలు**
- **అన్నారం–అబ్లాపూర్ చిత్రియాల్ ఎక్స్ రోడ్డు వరకు మరో బస్సు ఏర్పాటు చేయాలని విద్యార్థులు,సర్పంచ్ లు గ్రామస్థుల విజ్ఞప్తి**

మెదక్ ఆగస్టు 21, సిరి న్యూస్

మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని అన్నారం గ్రామ విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కష్టంగా మారింది. మెదక్ నుంచి కొడపాకకు ప్రస్తుతం ఒకటే బస్సు సర్వీసు ఉండటంతో అన్నారం, అబ్లాపూర్ గ్రామాల విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మెదక్ నుంచి

నాగ్సన్ పల్లి మీదుగా కొడపాకకు ఒక సర్వీసుతో పాటు మరో సర్వీసు అన్నారం, అబ్లాపూర్, గాజులగూడెం మీదుగా కొడపాకకు వెళ్లి అక్కడి నుంచి తిరిగి మెదక్‌కు వచ్చేది. దీంతో విద్యార్థులు, ప్రయాణికులకు కొంతమేర రవాణా సౌకర్యం ఉండేది. అయితే ఏడుపాయల వైపు నుంచి కొడపాకకు వచ్చే బస్సు సర్వీసు నిలిచిపోవడంతో ప్రస్తుతం మెదక్–కొడపాక మార్గంలో అందుబాటులో ఉన్న సర్వీసుపైనే ప్రయాణికులు ఆధారపడాల్సి వస్తోంది. కొడపాక నుంచి వచ్చే విద్యార్థులు, ప్రయాణికులతో బస్సు ముందుగానే నిండిపోతుండటంతో అన్నారం గ్రామానికి చేరుకునే సమయానికి బస్సులో ఖాళీ లేకుండా పోతోంది. దీంతో అన్నారం గ్రామంలో బస్సు నిలిపినా విద్యార్థులు, ప్రయాణికులను ఎక్కించుకునే పరిస్థితి లేకపోవడంతో బస్సు ఆగకుండా వెళ్లిపోతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో అన్నారం గ్రామానికి చెందిన పాఠశాల, కళాశాల విద్యార్థులు ఉదయం వేళ బస్సు కోసం రోడ్డుపై వేచి చూడాల్సి వస్తోంది. బస్సు వచ్చినా ఎక్కేందుకు అవకాశం లేకపోవడంతో తదుపరి రవాణా లేకపోవడంతో విద్యాసంస్థలకు సమయానికి చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఒకే సర్వీసు కొడపాక నుంచే ప్రయాణికులతో నిండిపోవడంతో అన్నారం, అబ్లాపూర్ గ్రామాల ప్రజలకు, విద్యార్థులకు సరైన రవాణా సౌకర్యం అందడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు అదనపు బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అన్నారం–అబ్లాపూర్–గాజులగూడెం మీదుగా కొడపాక వరకు మరో బస్సు సర్వీసును ఏర్పాటు చేసి, అక్కడి నుంచి మెదక్‌కు తిరిగి వెళ్లేలా చర్యలు తీసుకుంటే విద్యార్థులతో పాటు ఆయా గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో ఉన్న సర్వీసులను పునరుద్ధరించడంతో పాటు విద్యార్థుల రాకపోకలకు అనుకూలంగా అదనపు బస్సు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఆర్టీసీ డిపో అధికారులు స్పందించి అన్నారం గ్రామంలో బస్సు ఆగేలా, విద్యార్థులు సమయానికి పాఠశాలలు, కళాశాలలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## క్రీడలతోనే మానసికోల్లాసం

- **రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ లో జిల్లాకు పథకాలు తీసుకురావాలి.**
- **మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్.**
- **చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి.**
- **మెదక్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె జనార్ధన్ రెడ్డి.**

మెదక్ ఆగష్టు,21(సిరి న్యూస్)




క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని, విద్యార్థులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనాలని మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ అథ్లెటిక్ స్టేడియంలో జరుగుతున్న త్రోస్ రన్స్ మరియు లాంగ్ జంప్స్ విభాగాల్లో బాల బాలికలకు ఎంపికలు జరిగాయన్నారు.12వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ లో అండర్ 14,16, 18,20, బాల బాలికలు సుమారుగా మెదక్ జిల్లా నలుమూలల నుండి 450 క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి మెదక్ డీఎస్పీ, ప్రసన్న కుమార్,మెదక్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్ధన్ రెడ్డి లు ముఖ్య అతిథిలుగా హాజరై,క్రీడలను ప్రారంభించారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెడల్స్ వేసి అభినందించారు. మెదక్ డీఎస్పీ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పాల్గొనే క్రీడాకారులు మన మెదక్ జిల్లాకు పథకాలు తీసుకురావాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ..క్రీడాకారులు చదువులోనే కాదు, ప్రతిభావంతులైన క్రీడాకారులకు క్రీడలతో కూడా మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెడల్స్ తో సత్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 26, 27 న వరంగల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారాని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ గంగాల రమేష్, మెదక్ డిస్టిక్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అరుణర్తి వెంకటరమణ,మధుసూదన్, సుజాత,పీడీ రాజేందర్, మహిపాల్, ప్రకాష్, పూర్ణచందర్, అర్జున్,తో పాటు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.






## మానసిక ఒత్తిడితోనే గుండెపోటుకు ముప్పు

- **టెక్నాలజీ పెరిగిన అవగాహన లోపం.**
- **వయసుతో సంబంధం లేకుండా 30 నుండి 40 ఏళ్లకే గుండెపోటు.**
- **సరైన సమయంలో స్పందిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు.**
- **యశోద హాస్పిటల్ సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ శశి కే శ్రీవాత్సవ.**
- **మెదక్ ప్రెస్ క్లబ్‌లో గుండె ఆరోగ్యంపై అవగాహన సదస్సు.**

మెదక్ఆగష్టు,21(సిరి న్యూస్)

ఆధునిక ప్రపంచంలో వయస్సుతో సంబంధం లేకుండా గుండె జబ్బులు పెరుగుతున్నాయని యశోద హాస్పిటల్ సీనియర్ గుండె వైద్య నిపుణులు డా. శశి కే శ్రీవత్సవ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ ప్రెస్ క్లబ్ భవనంలో యశోద హాస్పిటల్స్ సౌజన్యంతో అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు వృద్ధుల్లో ఎక్కువగా కనిపించిన గుండెపోటు, ఇతర గుండె సమస్యలు ప్రస్తుతం 30-40 ఏళ్ల యువతలో కూడా పెరుగుతుండటం ఆందోళనకరమన్నారు. మారిన జీవనశైలి, శారీరక శ్రమ లేకపోవడం, అధిక మానసిక ఒత్తిడి, వేళకు నిద్రపోకపోవడం, జంక్‌ఫుడ్ అలవాట్లు ప్రధాన కారణాలని తెలిపారు.




**అప్రమత్తం చేసే సంకేతాలు:**

ఛాతీలో తీవ్రమైన నొప్పి లేదా ఒత్తిడి నొప్పి ఎడమ చెయ్యి, దవడ లేదా వీపుకు వ్యాపించడం కొద్దిపాటి నడకకే అధిక ఆయాసం విపరీతంగా చెమటలు పట్టడం కళ్లు తిరగడం గుండె వేగంగా కొట్టుకోవడంలాంటి కదలికలతో నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ గారిని సంప్రదించాలని పేర్కొన్నారు.

**గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే:**

రోజూ కనీసం 30 నిమిషాలు నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయాలి. పండ్లు, ఆకుకూరలు, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకుంటూ నూనె, ఉప్పు, చక్కెరను తగ్గించాలి. యోగా, ధ్యానం ద్వారా ఒత్తిడిని నియంత్రించాలి. 30 ఏళ్లు దాటిన వారు కనీసం ఏడాదికి ఒకసారి బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకోవడం మంచిదని వైద్యులు సూచించారు. “ఆరోగ్యకరమైన జీవనశైలే శ్రీరామరక్ష.” నివారణ చికిత్స కంటే మేలైనదని డా. శశి కే శ్రీవత్సవ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ సాయినాథ్ రెడ్డి,కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ నేతాజీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గడ్డం పెంచుకుంటే ఇన్ని లాభాలున్నాయా?

ఒకప్పుడు లవ్ ఫెయిల్యూర్స్, తాగుబోతులు, బద్ధకస్తులు గడ్డం పెంచుకొని తిరిగేవారు. గడ్డంతో ఉండే వాళ్లను చులకనగా చూసేవారు. ఇప్పుడు గడ్డం పెంచుకోవడం ఓ ఫ్యాషన్ అయిపోయింది. ఒక స్టైల్‌తో పాటు స్టేటస్ సింబల్‌గా చూపించుకోవడానికి ఉపయోగపడుతుంది. అందుకే చాలా మంది మగవారు గడ్డం పెంచడానికి ఇష్టపడుతుంటారు. యువత ఇదొక ట్రెండ్‌గా భావించి గడ్డం పెంచుకుంటారు. గడ్డం పెంచుకోవడంతో ఆరోగ్యానికి కూడా చాలా మంచి ప్రయోజనాలు దొరుకుతాయి. అసలు గడ్డం పెంచడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు పొందుతారు? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.






**యూవీ కిరణాల నుంచి రక్షణ..**
సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు(యూవీ రేస్) చాలా ప్రమాదకరమన్న విషయం తెలిసిందే. ఈ కిరణాలు మన శరీరంపై పడితే చర్మ సంబంధిత క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది. అయితే గడ్డం పెంచుకోవడం వల్ల ఈ సమస్య నుంచి తప్పించుకోవచ్చు. గడ్డం పెంచుకోవడం వల్ల.. ఆ గడ్డం చర్మాన్ని కవర్ చేస్తుంది. దీంతో యూవీ కిరణాలు చర్మంపై పడవు. తద్వారా యూవీ కిరణాల నుంచి వచ్చే సమస్యల బారి నుంచి తప్పించుకోవచ్చు. చలికాలంతో పాటు వేసవి కాలంలో కూడా చర్మం సాధారణంగా పొడి బారుతూ ఉంటుంది. దీని కారణంగా చర్మం పగిలిపోవడం వంటివి జరుగుతుంటాయి. అయితే గడ్డం ఉండడం వల్ల చర్మానికి కావాల్సిన తేమ దొరుకుతుంది. తద్వారా చర్మం పొడి బారకుండా ఉంటుంది. అలాగే చర్మం పగుళ్లను నివారించుకోవచ్చు.



**గొంతు సమస్యలు దూరం..**
సాధారణంగా గాలిలో ఎన్నో బ్యాక్టీరియాలు, వైరస్‌లు ఉంటాయి. అయితే గడ్డం ఉండడం వల్ల ఆ బ్యాక్టీరియాలు, వైరస్‌లు నోటిలోకి అంత సులభంగా ప్రవేశించవు. దీంతో గొంతు సమస్యలు, జలుబు, దగ్గు వంటి సమస్యల బారిన పడకుండా మనల్ని మనం రక్షించుకోవచ్చు. గడ్డం పెంచుకోవడం వల్ల అందంతో పాటు ఆరోగ్యం కూడా సొంతమవుతుంది.



**ముడతలు రావు..**
మారిపోయిన జీవన శైలి కారణంగా చాలా మందిలో చాలా తక్కువ వయసులోనే వృద్ధాప్య ఛాయలు కనిపిస్తున్నాయి. ముఖంపై ముడతలు మొటిమలు వంటివి చాలా మందిని వేధిస్తున్నాయి. అయితే గడ్డం పెంచుకోవడం వల్ల ఆ సమస్యల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. గడ్డం ముఖంపై ముడతలు రాకుండా చేస్తుంది. అలాగే మనిషిని యవ్వనంగా కనిపించే విధంగా ప్రేరేపిస్తుంది. దీంతో చర్మం అందంగా, వయసు తక్కువగా కనిపిస్తుంది.

**రాయల్ స్టేటస్..**
గడ్డం ఉన్న వ్యక్తులకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. వారి ముఖంలో తేజస్సు, రాజసం కనిపిస్తుంటుంది. అందుకే గడ్డం ఉండే వ్యక్తులకు సమాజంలో కూడా మంచి గుర్తింపు ఉంటుంది. పెద్ద మనిషి మాదిరిగా వారిని గౌరవిస్తూ ఉంటారు. ఏదో తెలియని ఆత్మవిశ్వాసం కూడా వారిలో పరిఢవిల్లుతుంది. గడ్డం ఉండడం వల్ల అందం, ఆరోగ్య ప్రయోజనాలతో పాటు సమాజంలో గుర్తింపు, గౌరవం కూడా లభిస్తుంది. అలా అని గడ్డం ఎలా పడితే అలా, పెంచకూడదు. గడ్డంను కూడా నీటిగా మెయింటైన్ చేయాల్సి ఉంటుంది. మరీ ఎక్కువగా పెరగకుండా మరీ చిన్నగా అవ్వకుండా మెయింటైన్ చేయాలి. అప్పుడే అందంగా కనిపిస్తాము. అలా అని ఎలా పడితే అలా పెంచేస్తే మాత్రం పిచ్చోడిలాగా కనిపిస్తాము.



# ఇమ్యూనిటీ ఇలా పెంచుకోండి

చలికాలంలో అందరినీ రోగాలు పలుకరిస్తూ ఉంటాయి. రోగాలు దరిచేరకుండా ఉండాలంటే ఇమ్యూనిటీ ఎంతో అవసరం. మరి ఇమ్యూనిటీని ఎలా పెంచుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం. చలికాలంలో జలుబు, దగ్గు వంటి వ్యాధులు కూడా తరచూ వస్తుంటాయి.. వీటి నుంచి బయట పడాలంటే మంచి పోషకాలు ఉన్న ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి..

చలికాలంలో జలుబు, ఫ్లూతో బాధపడుతున్నట్లయితే మీ రోగనిరోధక శక్తి బలహీనంగా ఉందని అర్థం.. రోగనిరోధక శక్తి బలహీనంగా ఉన్న వారు మాత్రమే తరచుగా వ్యాధుల బారిన పడుతుంటారు. అందుకే ఈ కాలంలో ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. కాగా.. ఈ చలికాలంలో రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి మన ఇంట్లోనే తయారు చేసుకునే ఆయుర్వేద ఔషధం తయారీ గురించి తెలుసుకుందాం..

**కావాల్సిన పదార్థాలు..**



- ఒక చెంచా దాల్చిన చెక్క పొడి
- అర కిలో బెల్లం
- ఒక చెంచా తేనె
- ఒక చెంచా నెయ్యి
- 500 గ్రాముల ఉసిరికాయ గుజ్జు
- ఒక చెంచా జాజికాయ చూర్ణం
- ఒక చెంచా శొంఠి పొడి
- ఒక చెంచా యాలకుల పొడి

మంచి నాణ్యమైన ఉసిరి కాయలు తీసుకోండి. వాటిని నీటితో శుభ్రంగా కడగండి. నీటిలో ఉసిరి కాయలను ఉడికించండి. ఆ తర్వాత గింజలు తీసి ఉసిరి గుజ్జును బయటకు తీయండి. ఇప్పుడు స్టౌ వెలిగించి ఓ గిన్నెలో నెయ్యి వేసి వేడి చేయండి. ఇందులోనే ఉసిరి గుజ్జును వేసి సన్నటి మంటపై వేయించండి. తర్వాత బెల్లాన్ని సన్నగా తురుముకొని ఉసిరి గుజ్జులో వేసి కలపి వేయించండి. ఈ సమయంలోనే ఓ చిన్న గిన్నెలో జాజికాయ చూర్ణం, దాల్చిన చెక్క, యాలకులు, శొంఠి పొడి వేసి కలపండి. బెల్లం కరిగిన తర్వాత ముందుగా కలిపిన పొడులను ఇందులో వేసి కలిపి స్టౌ ఆఫ్ చేసి పక్కకు పెట్టుకోండి. దీనిలో తేనె కలిపితే రోగనిరోధక శక్తిని పెంచే ఔషధం రెడీ అవుతుంది.

దీన్ని ఉదయం, సాయంత్రం ఒక్కో స్పూన్ చొప్పున అర కప్పు పాలలో కలిపి తీసుకోవాలి. పాలు గోరు వెచ్చగా ఉండాలి. ఇలా కొన్ని నెలల పాటు చేస్తే.. ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుందని నిపుణులు తెలిపారు.

# బీర్ తాగితే కలిగే అనర్థాలు ఇవే..

చాలామంది మద్యం ప్రియులు తాము విస్కీ, రమ్, వొడ్కా కాకుండా బీర్ తీసుకుంటున్నాం కాబట్టి తక్కువ ప్రమాదంలో ఉన్నామని భావిస్తూ ఉంటారు. ఈ మధ్య ముఖ్యంగా స్కూల్, కాలేజీ స్థాయిల్లోనే బీర్లు తెగ తాగేస్తున్నారు. అయితే బీర్ కూడా ఎంతో డేంజర్ అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మన దేశంలో మద్యం సేవించే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. మద్యం తాగే వారు ముందుగా బీర్‌ను ఎంపిక చేసుకుంటారు. ఇందులో విస్కీతో పోలిస్తే కొంచెం తక్కువ మొత్తం ఆల్కహాల్ ఉంటుంది. అలాగే తాగడానికి కొంచెం సులువుగా అనిపిస్తుంటుంది. దేశంలో అనేక రకాల బీర్లు అందుబాటులో ఉన్నాయి. ఈ బీర్‌లో 4 శాతం నుంచి 6 శాతం వరకు ఆల్కహాల్ ఉంటుంది. అయితే ఈ బీర్‌ను లిమిట్‌లో తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఇప్పటికే పలువురు ఆరోగ్య నిపుణులు తెలిపారు. అదే శృతిమించి తాగితే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని చెబుతున్నారు. ఇంతకీ వారానికి ఎన్ని బీర్లు తాగాలి? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**14 యూనిట్లు మాత్రమే..**
నేషనల్ హెల్త్ సర్వీసెస్ ప్రకారం పురుషులు లేదా మహిళలు వారానికి కేవలం 14 యూనిట్ల కంటే ఎక్కువ మద్యం తీసుకోకూడదు. 14 యూనిట్లు లేదా 10 మిల్లి లీటర్లు, లేదా 8 గ్రాముల మధ్య మాత్రమే తీసుకోవాలి. అప్పుడే అనేక ఆరోగ్య ప్రయోజనాలు అందుతాయి. ఉదాహరణకు ఒక బీర్‌లో 5 శాతం ఆల్కహాల్ ఉంటుంది. అంటే అందులో 3 యూనిట్ల ఆల్కహాల్ ఉంటుంది. అంటే మీరు వారానికి ఆరు బాటిళ్ల సాధారణ బీర్ తాగితే మీరు 14 యూనిట్ల పరిమితిలో ఉంటారు. అంతకు మించి తాగితే కచ్చితంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒకవేళ ప్రతిరోజూ ఆల్కహాల్ తాగాలనుకునే వారు.. వారంలో కనీసం రెండు రోజులు ఆపేయాలి. ఇలా చేయడం వల్ల ఆల్కహాల్ నుంచి శరీరం కోలుకోవడానికి కొంత సమయం దొరుకుతుంది. అలాగే అనారోగ్య సమస్యల బారిన పడకుండా రక్షించుకోవచ్చు.

**గుండె సమస్యలు..**
బీర్ లో టాప్ 10 ఆశ్చర్యకరమైన హెల్త్ బెనిఫిట్స్
"బీర్ లో టాప్ 10 ఆశ్చర్యకరమైన హెల్త్ బెనిఫిట్స్ "
సాధారణంగా బీర్‌లో చిన్న మొత్తంలో విటమిన్లు, యాంటీ యాక్సిడెంట్లు, ఖనిజాలు ఉంటాయి. అవి ఎముకలను దృఢపరుస్తాయి.
దీని కారణంగా ఎముకలకు సంబంధించిన వ్యాధులు తగ్గిపోతాయి. అలాగే ఈ బీర్‌లో పాలిఫెనాల్స్ అనే పదార్థం ఉంటుంది. ఇవి గుండెకు సంబంధించిన సమస్యలు దూరమైపోతాయి.
అలాగే ఇతర రోగాలు కూడా నయమవుతాయి. సాధారణంగా రోజుకు ఒక బీరు తాగే మహిళలు, రోజుకు రెండు బీర్లు తాగే పురుషుల్లో గుండె సంబంధిత సమస్యలు రావని ఓ అధ్యయనంలో వెల్లడైంది.





# గిల్‌కు స్పిన్ పరీక్ష.. రెండో టెస్టుకు ముందు ప్రత్యేక సాధన

శ్రీలంకతో తొలి టెస్టులో ఘన విజయం సాధించిన టీమిండియా.. రెండో టెస్టుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ముఖ్యంగా ఎడమచేతి వాటం స్పిన్నర్లను ఎదుర్కోవడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాడు. గాలే టెస్టులో శ్రీలంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో గిల్ రెండుసార్లు ఔటైన నేపథ్యంలో ఈ సాధనకు ప్రాధాన్యం ఏర్పడింది. తొలి ఇన్నింగ్స్‌లో 16, రెండో ఇన్నింగ్స్‌లో 8 పరుగులకే పెవిలియన్ చేరిన గిల్.. రెండో టెస్టులో ఆ లోపాన్ని అధిగమించాలని భావిస్తున్నాడు. ఆ మ్యాచ్‌లో భారత్ 165 పరుగుల తేడాతో విజయం సాధించింది. రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి కొలంబోలో ప్రారంభం కానుంది.

**జడేజా, సుతార్‌తో సాధన**

కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ నెట్స్‌లో గిల్ ప్రత్యేకంగా లెఫ్టార్మ్ స్పిన్‌ను ఎదుర్కొన్నాడు. మానవ్ సుతార్, రవీంద్ర జడేజాతో పాటు స్థానిక బౌలర్ల బంతులను కూడా చాలాసేపు ఆడాడు. టెస్టుల్లో ఇప్పటివరకు 42 మ్యాచ్‌లు ఆడిన గిల్‌ను ఎడమచేతి వాటం స్పిన్నర్లు 11 సార్లు ఔట్ చేశారు.

**పరిస్థితులకు తగ్గట్టుగా ఆట**

గిల్ సాధనపై టీమిండియా స్పిన్ బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే స్పందిస్తూ.. పరిస్థితులకు అనుగుణంగా తన ఆటను మార్చుకునేందుకు గిల్ ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. పిచ్ పరిస్థితులు, బంతి వేగం, ఆడాల్సిన షాట్లు, డిఫెన్స్ వంటి అంశాలను గమనిస్తూ గిల్ తన ఆటను మెరుగుపరుచు కుంటున్నాడని చెప్పారు. మరోవైపు ఆఫ్‌స్పిన్నర్లు, లెగ్‌స్పి న్నర్లపై గిల్ రికార్డు మెరుగ్గా ఉండటం టీమిండి యాకు సానుకూల అంశంగా మారింది.



## ఇండియా హౌస్‌లో టీమిండియాకు గ్రాండ్ డిన్నర్..

# శ్రీలంకతో కలిసి విందు

శ్రీలంక పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టుకు కొలంబోలో ఘనమైన ఆతిథ్యం లభించింది. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్‌కు ముందు శ్రీలంకలోని భారత హైకమిషనర్ సంతోష్ ఝా కొలంబోలోని 'ఇండియా హౌస్'లో ఇరు దేశాల క్రికెట్ జట్లకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.

**ఇరు జట్ల ఆటగాళ్లతో ప్రత్యేక విందు**

ఇండియా హౌస్‌లో జరిగిన ఈ విందు కార్యక్రమంలో భారత, శ్రీలంక ఆటగాళ్లతో పాటు ఇరు జట్ల టీమ్ మేనేజ్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ చిరస్మరణీయ సాయంత్రానికి సంబంధించిన ఫొటోలు, వివరాలను బీసీసీఐ తన అధికారిక సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా పంచుకుంది. ఈ విందు ఇరు దేశాల మధ్య క్రీడా సంబంధాలను మరింత బలోపేతం చేసిందని భారత హైకమిషనర్ సంతోష్ ఝా పేర్కొన్నారు.

**సిరీస్‌లో భారత్ 10 ఆధిక్యం**

ప్రస్తుతం రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత్ 10 ఆధిక్యంలో ఉంది. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో శ్రీలంకపై టీమిండియా 165 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. రెండో టెస్టులోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భారత జట్టు పట్టుదలతో ఉంది.

**కొలంబో టెస్టుపై టీమిండియా ఫోకస్**

కొలంబోలో జరగనున్న రెండో టెస్టులో విజయం సాధిస్తే భారత్ సిరీస్‌ను 20తో కైవసం చేసుకోనుంది. అదే సమయంలో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC) పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని టీమిండియా లక్ష్యంగా పెట్టుకుంది.

# గాయత్రి–త్రిసా జోడీ సంచలనం.. 15 ఏళ్ల నిరీక్షణకు తెర!

బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత బ్యాడ్మింటన్ అమ్మాయిలు చరిత్ర సృష్టించారు. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్, త్రిసా జాలీ జోడీ అద్భుత ప్రదర్శనతో పతకం ఖాయం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్‌లోకి ప్రవేశించడం ద్వారా 15 ఏళ్ల తర్వాత మహిళల డబుల్స్‌లో భారత్‌కు మరో పతకం అందించేందుకు ఈ జంట సిద్ధమైంది.

**నాలుగో సీడ్‌పై సంచలన విజయం**

16వ రౌండ్‌లో ఏడో సీడ్‌ను ఓడించిన గాయత్రి-త్రిసా జంట.. తదుపరి రౌండ్‌లో నాలుగో సీడ్ చైనా జోడీ జియా యీ ఫాన్, ఝాంగ్ షు గ్జియాన్‌పై సంచలన విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో తొలి సెట్‌ను 1621తో కోల్పోయిన భారత జోడీ ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా పుంజుకుంది. రెండో సెట్‌ను 2115తో గెలుచుకుంది.

**...డో సెట్‌లో చైనాకు చెక్**

...యాత్మక మూడో సెట్‌లోనూ గాయత్రి, త్రిసా ఆధిపత్యం కొనసాగింది. చైనా జోడీకి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా 21 ...3తో సెట్‌ను సొంతం చేసుకుని మ్యాచ్‌ను ముగించింది. దీంతో వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు మహిళల డబుల్స్ విభాగంలో మరో పతకం ఖాయమైంది.

**అశ్విని– జ్వాల తర్వాత రెండో జంట**

గాయత్రి-త్రిసా జంట విజయంతో మహిళల డబుల్స్‌లో ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ పతకం ఖాయం చేసిన రెండో భారత జంటగా రికార్డు సృష్టించింది. 2011లో అశ్విని పొన్నప్ప, గుత్తా జ్వాల జోడీ కాంస్య పతకం సాధించింది.







# రీఎంట్రీలో హెన్రిక్స్ విధ్వంసం

ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ మోయిసెస్ హెన్రిక్స్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చిన వెంటనే అదరగొట్టాడు. 39 ఏళ్ల వయసులో పోర్చుగల్ తరఫున బరిలోకి దిగిన హెన్రిక్స్.. టీ20 ప్రపంచకప్ యూరప్ సబ్‌రీజనల్ క్వాలిఫయర్‌లో చెకియాపై కేవలం 51 బంతుల్లోనే 111 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. అతడి మెరుపు ఇన్నింగ్స్‌తో పోర్చుగల్ భారీ స్కోరు సాధించి ఘన విజయం అందుకుంది.

**51 బంతుల్లో 111 పరుగులు**

ముందుగా బ్యాటింగ్ చేసిన పోర్చుగల్ నిర్ణీత 20 ఓవర్లలో 211 పరుగులు చేసింది. ఇందులో హెన్రిక్స్ ప్రధాన పాత్ర పోషించాడు. 51 బంతులు ఎదుర్కొన్న అతడు 12 ఫోర్లు, 7 సిక్సర్లతో 111 పరుగులు చేశాడు. అతడి స్ట్రైక్‌రేట్ 217.64గా నమోదైంది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో హెన్రిక్స్‌కు ఇదే తొలి సెంచరీ కావడం విశేషం.

**ఆస్ట్రేలియా తరఫున సాధ్యం కానిది..**

ఆస్ట్రేలియా తరఫున 21 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడిన హెన్రిక్స్.. ఆ జట్టు తరఫున ఒక్క సెంచరీ కూడా చేయలేకపోయాడు. అయితే పోర్చుగల్ తరఫున తన మూడో మ్యాచ్‌లోనే శతకం బాదడం విశేషం. రీఎంట్రీలోనే సత్తా చాటడంతో అతడి ప్రదర్శనకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# కుల్‌దీప్‌పై పూర్తి నమ్మకం.. రెండో టెస్టులో పుంజుకుంటాడు

శ్రీలంకతో తొలి టెస్టులో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన భారత స్టార్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌పై టీమిండియా స్పిన్ బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే పూర్తి నమ్మకం వ్యక్తం చేశాడు. ఒక్క మ్యాచ్ ఆధారంగా కుల్‌దీప్ సామర్థ్యాన్ని అంచనా వేయడం సరికాదని, కొలంబోలో జరిగే రెండో టెస్టులో అతడు తప్పకుండా పుంజుకుంటాడని ధీమా వ్యక్తం చేశాడు.

**తొలి టెస్టులో ఒక్క వికెట్**

గాలే టెస్టులో కుల్‌దీప్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 25 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ మాత్రమే తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 14 ఓవర్లు వేసి 65 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీసుకోగా.. రెండో ఇన్నింగ్స్‌లో 11 ఓవర్లు వేసినా వికెట్ దక్కలేదు. అతడి ఏకైక వికెట్ కమిందు మెండిస్‌ది. శుభ్‌మన్ గిల్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో కుల్‌దీప్‌కు వికెట్ లభించింది.

**పరిస్థితులే కారణం**

గాలే పిచ్, బంతి పరిస్థితులు కుల్‌దీప్ బౌలింగ్‌కు అనుకూలంగా లేవని బహుతులే పేర్కొన్నాడు. కూకాబుర్రా బంతి మెరుపు తగ్గి మెత్తబడిన తర్వాత మణికట్టు స్పిన్నర్లకు ఆశించినంత సహకారం లభించలేదని వివరించాడు. పిచ్ నెమ్మదించడంతో కుల్‌దీప్ తన బౌలింగ్ వేగం, బంతి వేసే ట్రాజెక్టరీని మార్చుకోవాల్సి వచ్చిందని తెలిపాడు.

మ్యాచ్ విన్నర్‌గా కుల్‌దీప్ "కుల్‌దీప్ ఎప్పటికీ మ్యాచ్ విన్నరే. అతడు మా ప్రణాళికల్లో కీలక భాగం. ఒక్క మ్యాచ్‌తో అతడి సామర్థ్యాన్ని అంచనా వేయలేం. రెండో టెస్టులో అతడు తిరిగి పుంజుకుంటాడనే నమ్మకం మాకు ఉంది" అని బహుతులే స్పష్టం చేశాడు.

## టీమిండియా బ్యాటింగ్‌పై ఆర్నాల్డ్ విమర్శలు

శ్రీలంకతో గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో టీమిండియా 165 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. బౌలింగ్, ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్ అదరగొట్టినా.. బ్యాటింగ్‌పై శ్రీలంక మాజీ క్రికెటర్ రస్సెల్ ఆర్నాల్డ్ ప్రశ్నలు సంధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులు చేసిన భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో 193 పరుగులకే ఆలౌటైంది. దీంతో శ్రీలంక ముందు 372 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది.

**పడిక్కల్, రాహుల్ మాత్రమే రాణించారు**

భారత బ్యాటర్లలో దేవదత్ పడిక్కల్, కేఎల్ రాహుల్ మాత్రమే చెప్పుకోదగ్గ ప్రదర్శన చేశారని ఆర్నాల్డ్ అభిప్రాయపడ్డాడు. వీరిద్దరి భాగస్వామ్యాన్ని పక్కన పెడితే మిగతా బ్యాటర్లు పెద్దగా పరుగులు చేయలేదని పేర్కొన్నాడు. శుభ్‌మన్ గిల్, రవీంద్ర జడేజా, రిషభ్ పంత్, యశస్వి జైస్వాల్ వంటి నాణ్యమైన ఆటగాళ్లు ఉన్నప్పటికీ ఈ మ్యాచ్‌లో వారు రాణించలేదని తెలిపాడు.





## 'మూకుతి అమ్మన్ 2'లో
# రెజీనా విలన్!

నయనతార ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'మూకుతి అమ్మన్ 2'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సుందర్ సి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నటి రెజీనా కసాండ్రా కీలక పాత్రలో కనిపించనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అంతేకాదు.. ఆమె ప్రతి నాయక పాత్రలో నటించనున్నట్లు సమాచారం. రెజీనా పాత్రను దర్శకుడు సుందర్ సి ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. నయనతారకు దీటుగా సాగే ఈ పాత్ర కథలో కీలకంగా ఉండనుందని సమాచారం. దీంతో నయనతార, రెజీనా మధ్య పోరాటం ఎలా ఉండబోతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరుగుతోంది. రూ.100 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. తొలి భాగంతో పోలిస్తే ఇందులో దృశ్య ప్రభావాలు, అద్భుత అంశాలు, యాక్షన్ సన్నివేశాలను మరింత భారీగా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై డాక్టర్ ఇషారి కె. గణేష్ నిర్మిస్తున్నారు. 'అరణ్మనై' చిత్రాలతో అద్భుత అంశాలు, హారర్, వినోదాన్ని తెరకెక్కించడంలో గుర్తింపు తెచ్చుకున్న సుందర్ సి.. 'మూకుతి అమ్మన్ 2'ను కూడా భారీ వినోదాత్మక చిత్రంగా రూపొందిస్తున్నట్లు సమాచారం. థియేటర్లలో విడుదలైన అనంతరం ప్రముఖ ఓటీటీ వేదిక జియోహాట్‌స్టార్‌లో ఈ చిత్రం ప్రసారం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## 'ఇరుముడి' ఎలా ఉందంటే..
# రవితేజకు మంచి కమ్‌బ్యాక్!

రవితేజ కథానాయకుడిగా, శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇరుముడి'పై విడుదలకు ముందే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. కుటుంబ భావోద్వేగాలు, ఉత్కంఠభరిత అంశాలతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సీలేరు ప్రాంతంలో ఆటో నడుపుతూ, అరటిపళ్ల వ్యాపారం చేసుకునే త్రినాథ్ తన భార్య, కూతురితో ఆనందంగా జీవిస్తుంటాడు. అయితే పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అనూహ్యంగా మృతి చెందడంతో అతని కుటుంబం జీవితంలో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటాయి. ఆ మరణం వెనుక అసలు కారణమేంటి? అనేది కథలో ప్రధాన అంశంగా సాగుతుంది. కుటుంబ అనుబంధాలు, నేర పరిశోధన, భావోద్వేగాలను దర్శకుడు శివ నిర్వాణ సమర్థంగా మేళవించారు. ద్వితీయార్థంలో కొంత నెమ్మదించినా.. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ బలంగా ఉండటంతో సినిమా ప్రభావం పెరుగుతుంది. కథ ద్వారా అందించిన సందేశం కూడా ఆలోచింపజేసేలా ఉంది. త్రినాథ్ పాత్రలో రవితేజ కొత్తగా కనిపించారు. భావోద్వేగ తండ్రిగా, మద్యానికి బానిసైన వ్యక్తిగా, అయ్యప్ప స్వామి భక్తుడిగా విభిన్న కోణాలను సమర్థంగా చూపించారు. నక్షత్ర, ప్రియా భవానీ శంకర్, సాయికుమార్, అజయ్ ఘోష్ తమ పాత్రలకు న్యాయం చేశారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం, నేపథ్య సంగీతం సినిమాకు బలంగా నిలిచాయి. 'మల్లెపూల పల్లకి' పాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీలేరు ప్రాంతంలోని సహజమైన ప్రదేశాల్లో చిత్రీకరణ చేయడంతో కథ మరింత సహజంగా అనిపిస్తుంది. నిర్మాణ విలువలు కూడా కథకు తగ్గట్టుగా ఉన్నాయి. మొత్తంగా 'ఇరుముడి' రవితేజ అభిమానులతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగ థ్రిల్లర్‌గా నిలుస్తుంది.





# హీరోగానూ లోకేష్ సెన్సేషన్

- రూ. 100 కోట్ల క్లబ్‌లో 'డీసీ' సినిమా!

**దర్శకుడిగా సంచలన విజయాలు అందుకున్న లోకేష్ కనగరాజ్ హీరోగానూ సత్తా చాటుతున్నారు. ఆయన నటించిన 'డీసీ' సినిమా విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరింది. ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం తొలి షో నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో వామికా గబ్బి కథానాయికగా నటించారు.**

**సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రంలో లోకేష్ దేవదాస్ పాత్రలో కనిపించారు. దర్శకుడిగా స్టార్ ఇమేజ్ సొంతం చేసుకున్న ఆయన.. తొలి చిత్రంతోనే హీరోగా రూ.100 కోట్ల మైలురాయిని అందుకోవడం ప్రత్యేకంగా నిలిచింది. తాజాగా ఈ విజయాన్ని తెలియజేస్తూ చిత్రబృందం విడుదల చేసిన లోకేష్ మాస్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అనిరుధ్ రవిచందర్ నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది.**

## దీపికాపై 'స్పిరిట్' నిర్మాత సంచలన వ్యాఖ్యలు

ప్రభాస్ హీరోగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కనున్న 'స్పిరిట్' నుంచి దీపికా పదుకొణె తప్పుకోవడంపై చిత్ర నిర్మాత ప్రణయ్‌రెడ్డి వంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. హీరోయిన్ పాత్ర కోసం సందీప్‌రెడ్డి దాదాపు ఏడాదిన్నర పాటు దీపికాతో చర్చలు జరిపారని, ఆమె ప్రతిభపై నమ్మకంతోనే తొలుత సంప్రదించామని తెలిపారు. అయితే పారితోషికం, లాభాల్లో వాటా, షూటింగ్ డేట్స్, పని వేళల విషయంలో ఆమె పెట్టిన షరతులు తమకు అనుకూలంగా లేకపోవడంతోనే ప్రాజెక్ట్ నుంచి తప్పించామని చెప్పారు.
దీపికా భారీ పారితోషికంతో పాటు సినిమా లాభాల్లో 10 శాతం వాటా కోరినట్లు ప్రణయ్ వెల్లడించారు. షూటింగ్ సమయం, డేట్స్ విషయంలోనూ కొన్ని నిబంధనలు పెట్టారని తెలిపారు. అవి తమ నిర్మాణ విధానానికి సరిపోకపోవడంతో ఆమె స్థానంలో 'యానిమల్' ఫేమ్ త్రిప్తి డిమ్రిని తీసుకున్నట్లు వివరించారు. అంతేకాకుండా సందీప్‌రెడ్డితో జరిగిన గోప్యమైన చర్చలను దీపికా తన ప్రజా సంబంధాల బృందం ద్వారా మీడియాకు లీక్ చేయించారని నిర్మాత ఆరోపించారు. నమ్మకంతో జరిగిన చర్చలు బయటకు రావడం తమను తీవ్రంగా బాధించిందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం బాలీవుడ్, టాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.




# మెగా అభిమానులకు డబుల్ ధమాకా!

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎదురుచూస్తున్న మెగా 158 నుంచి అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 22న సినిమా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.
'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కలయికలో వస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో చిరంజీవిని సరికొత్త అవతార్, పవర్‌ఫుల్ స్వాగ్‌తో చూపించారు. 'బ్లడీ బెంచ్‌మార్క్' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్ కూడా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.
సినిమా చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే తొలి భాగం షూటింగ్, ఎడిటింగ్ పనులు పూర్తయినట్లు సమాచారం. అనస్వర రాజన్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ భారీ యాక్షన్ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు.
కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆగస్టు 22న విడుదల కానున్న టైటిల్ గ్లింప్స్‌లో చిరంజీవి కొత్త అవతార్ ఎలా ఉండబోతుందో తెలియనుంది.

# ఇన్‌స్టా రీల్స్‌తో ఇరుముడి అవకాశం!

"నా తొలి తెలుగు సినిమా 'ఇరుముడి' కావడం... స్నేహంగా మెలిగే రవితేజ, ప్రియా భవానీ శంకర్‌తో కలిసి ఇందులో నటించడం ఎంతో సంతోషాన్నిచ్చింది" అని చెప్పింది బేబి నక్షత్ర. ఏడో తరగతి చదువుతున్న ఈ చిన్నారి ఓ కీలక పాత్ర పోషించిన చిత్రం 'ఇరుముడి'. రవితేజ, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించారు. శివ నిర్వాణ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మించారు. ఈ రోజే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించింది నక్షత్ర. "ఇప్పటి వరకూ ఆరు సినిమాలు చేశా. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ ఇలా భిన్న భాషలు, సంస్కృతిని అర్థం చేసుకుంటూ ఈ సినిమాలు చేయడం మంచి అనుభవం. ఇన్‌స్టాలో నేను చేసిన రీల్స్ చూసే దర్శకుడు శివ నిర్వాణ నాకు 'ఇరుముడి' సినిమాలో నటించే అవకాశం ఇచ్చారు.







# ఇన్నర్‌వేర్ విప్పమన్నారు.. కంగనా శర్మ

బాలీవుడ్ నటి కంగనా శర్మ సినీ పరిశ్రమలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని వెల్లడించారు. 'హేట్ స్టోరీ 2' కాస్టింగ్ సమయంలో ఓ ఏజెన్సీ ప్రతినిధి సినిమా అవకాశం కోసం తన ఇన్నర్‌వేర్ విప్పాలని అసభ్యకరంగా అడిగాడని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురై అతడిని నిలదీశానని చెప్పారు. తాను అతడి ధైర్యాన్ని పరీక్షించేందుకే అలా మాట్లాడానని ఆ వ్యక్తి సర్దిచెప్పుకునే ప్రయత్నం చేశాడని వెల్లడించారు. క్యాస్టింగ్ కౌచ్ ఒక్క సినీ పరిశ్రమకే పరిమితం కాదని, మహిళలు పనిచేసే అనేక రంగాల్లో ఇలాంటి సమస్యలు ఉన్నాయని కంగనా అభిప్రాయపడ్డారు. తన చిన్ననాటి ఆర్థిక ఇబ్బందులను కూడా ఆమె గుర్తుచేసుకున్నారు. తండ్రికి ఉద్యోగం లేకపోవడం, సొంత ఇల్లు లేకపోవడంతో పాటు తిండి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయని తెలిపారు. చిన్నతనంలో ఓ బంధువు తనను వేధింపులకు గురిచేశాడని, ఆ విషయం అప్పట్లో కుటుంబ సభ్యులకు తెలియదని చెప్పారు. ఈ వ్యాఖ్యలు
ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.